**PRAMUKHANDHRA** 29th Year of Publication **We carry the news and views of Telugus**

29 వ సంవత్సరం

# ప్రముఖాంధ్ర



వ్యవస్థాపకులు

శ్రీ గోవేటి శ్రీ రామారావు

₹.15

ఫిబ్రవరి 2023

THE ONE AND ONLY TELUGU MAGAZINE CIRCULATED IN USA, UK, CANADA, GERMANY, AUSTRALIA, MAURITIUS, SOUTH AFRICA, UAE, KUWAIT, SINGAPORE, MALAYSIA & ALL OVER INDIA



# తమిళనాడులో వియత్నాం గౌరవ రాయబారిగా కవితదత్ నియామకం

భారత్ – వియత్నాం దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలు వృద్ధి చెందుతున్నాయని ఆ దేశ రాయబారి న్గుయెన్ థాన్ హై అన్నారు. ఇటీవల కె సి పి సంస్థ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ కవిత దత్ తమిళ నాడులో వియత్నాం గౌరవ రాయబారిగా నియామకం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. ఇరుదేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలు మరింత మెరుగు పడడానికి, ఇరు దేశాలలో పెట్టుబడులు పెట్టడానికి ఈ నియామకం దోహద పడుతుంది అన్నారు.

ఈ సందర్భంగా కె సి పి సంస్థ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ , ప్రపంచ తెలుగు సమాఖ్య ఉపాధ్యక్షురాలు వెలగపుడి కవిత దత్ గౌరవార్థం ప్రపంచ తెలుగు సమాఖ్య ఒక అభినందన సభను ఏర్పాటు చేసింది. సభకు ప్రపంచ తెలుగు సమాఖ్య అధ్యక్షురాలు వి ఎల్ ఇందిర దత్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా రాజ్యసభ సభ్యులు ఎం పి వేమిరెడ్డి ప్రభాకర రెడ్డి మట్లాడుతూ కవిత దత్ ఇలాంటి పదవులు మరెన్నో అధిరోహించాలని అభినందనలు చెపుతూ శాలువతోను జ్ఞాపికతోను ఘనంగా సత్కరించారు.

కవితదత్ తన స్పందనను తెలియజేస్తూ మీ అందరి అభిమానం , మా తండ్రిగారు వి ఎల్ దత్ దివ్య ఆశీస్సులే ఈరోజు తమిళనాడు వియత్నాం దేశపు గౌరవ రాయభారిగా నేను మీ ముందు నిలబడేందుకు ముఖ్య కారణంగా భావిస్తున్నాను. డాక్టర్ వి ఎల్ దత్ గారి దూర దృష్టి ,చొరవ, మరియు కె సి పి మరియు వియత్నాం మధ్య పారిశ్రామిక అనుబంధానికి , తద్వారా గౌరవప్రదమైన బాంధవ్యానికి బాటలు వేసాయని నేను సగర్వంగా చెప్పగలను. నాకు లభించిన ఈ గౌరవాన్ని ఒక హోదాగా కాకుండా ఒక భాధ్యతగా తీసుకుంటున్నాను. దక్షిణాది రాష్ట్రాలకు ముఖ్యంగా తమిళనాడుకు వియత్నాం దేశంతో వాణిజ్య , పారిశ్రామిక , విద్యా రంగాల్లో ద్వైపాక్షిక సంబంధాలను మెరుగుపర్చేందుకు తనవంతు కృషి చేస్తానని, నిరంతరం లభిస్తున్న అమ్మ అభిమానం , నాన్న ఆశీస్సులతో , కుటుంబ గౌరవాన్ని , కె సి పి విలువలును , భారతదేశ ఔన్నత్యాన్ని కాపాడుకుంటూ వియత్నాం మరియు భారతదేశ ద్వైపాక్షిక సంబంధాల పురోగతికి కృషి చేస్తానని , తనకీ సత్కారాన్ని ఏర్పాటు చేసిన ప్రపంచ తెలుగు సమాఖ్య అధ్యక్షులు ఇందిర దత్ మరియు కార్యవర్గ సభ్యులు , జీవితకాల సభ్యులందరికి పేరు పేరునా ధన్యవాదాలను తెలియజేసారు.

ఈ కార్యక్రమాన్ని డాక్టర్ శివరామప్రసాద్ , శ్రీ లక్ష్మి మోహన్ రావు చక్కగా నిర్వహించారు.












# ప్రముఖాంధ్ర

ప్రపంచ తెలుగుల మానస పత్రిక

ఫిబ్రవరి 2023

సంపుటి : 29 **339** సంచిక : 2




# మునుపేమి తపములు చేసిరో మునులు వారి భాషణములే భూషణములుగ నొప్పెను!

**త**ళుకు చెక్కుల ముద్దుపెట్టుకొను తల్లి కౌసల్య ! ముద్దుల చంద్రమా శ్రీరామ రారా – నని తండ్రి దశరథుడు! తనివి తీర పరిచర్య చేయ తమ్ముడు లక్ష్మణుడు! కౌసల్యా సుప్రజా రామా సూర్యుడు తూర్పుకొస్తున్నా డని తన మేలుకతనుజూచి ఉప్పొంగె గురుడు కౌశికుడు! శిలాతాపంబణిగి రూపవతి యయిన అహల్య! ధర్మాత్ము చరణంబు తగిలి శివచాపంబు విరిచిన రామవిభునికి తనయనొసగి కనుల ఆనందముగనె జనకుడు! దరహరంబు కరంగ కరమునబట్టె కనక జానకి! త్యాగరాజాప్తయని పొగడ, నారదమౌని యేమేమి తపము చేసెనో–

–ఇన్ని మమతామధురిమలెక్కడివి! మన రాగరాజ త్యాగరాగ సచివుడు, రాగంమ్మేళవించిన వారి భాషణములు చెప్పంగ మన ఐతిహాసిక భూషణములను హృదయమునకు హత్తుకు నతని చెప్పుకొంటున్నాను. త్యాగరాజవారి భూషణములుగా వినిన నారదమునీంద్రుడేఃవి తపమొనర్చనని పొగుడుకున్నాను.

స్మృతీ శ్రుతి సంగమశృతిని విని పరవశించాం. మన భాషణము లంతటి భూషణములే!

**మం**చివాళ్ళకందరూ మంచివారే కాబట్టి– త్యాగరాజు మంచితనమును మననం చేసుకోవడం నారదుడేమి తపః ఫలం చేసికొన్నాడో అనుకున్నాడు. వీరందరూ చంద్రుని పదహారు కళల వంటివారే.

**ఆం**ధ్రులు, షోడశ కళారాధకులు. రామచంద్రున్నీ, చంద్రుని షోడషోప కళల్నీ మార్గదర్శనం చేసుకున్నారు. త్యాగరాజుగారు చెప్పినా, పోతనగారు చెప్పినా తెలుగువాళ్ళను షోడశకళామూర్తులుగానూ, షోడషకళారాధకులు గానూ వచించారు.

కోపాలు వచ్చినా అవి ప్రథమకోపాలుగానే ఉంటాయే తక్క, కోపాలకు కోపాలను రైలుపెట్టెల్లా తగిలించుకొనిపోరు.

కుటుంబ కట్టుబాట్లు ఎక్కువ. తల్లీ, తండ్రీ, అన్నాతమ్ముడూ, కౌశికుని శిష్యప్రేమ, రాతిని నాతిని చేసిన కత్రృజ్ఞత, శివుని విల్లు విరిచి కోమలి కరగ్రహణము బట్టిన హృదయనేత్రా అంటూ స్మృతి శృతిలనూ రెండు కలిపి లయ రాగయుక్తం చేసిన త్యాగరాజే షోడశకళారాధకుడు.

హరి హర స్మరణం ప్రప్రథమ హారతితోనే ఆనందించి, నారద మునీంద్రుడు పురాణేతిహాసభాషణ భూషణములు కలవారై ఉండగా, భాషణా భూషితులగు ఇరు తెలుగువారు **ఇస్తినమ్మ వాయినం, పుచ్చుకుంటు నమ్మ వాయనం**– అని సమయోచితంగా ముందుకు వెడుతూ మంచి రాజ్యపాలన చేయగలరు.

మావైపు ఏంవీ సంశయం పెట్టుకోకయ్యా నారదా! మా త్యాగరాజుల గారి మాటల్ని రాజమార్గముగా విశ్వసింపచేస్తూ భాషణములనే భూషణములుగా తలపించేటట్టు **కౌసల్యా సుప్రజా రాముడు శ్రీనివాసుడూ, భద్రాచలేశ్వరుడు రామ చంద్రుడూ** అభయము లొసగు గాత! సీమాంధ్ర – తెలంగాణ ములు సస్యశ్యామల కోమలమై వర్ధిల్లుగాత! పౌరులు సుఖసంపన్నులై వర్ధిల్లుగాక! శుభమస్తు!




బుధజన విధేయుడు

*– గోటేటి శ్రీరామారావు*

(సెప్టెంబరు 2014)


Founder Editor : **GOTETI SRI RAMA RAO**, Editor : **GOTETI VENKATESWARA RAO**
Printed, Published & Owned by **G.V.RAO**, Associate Editor
at **GOTETI GRAPHICS**, 16 (64), Thambiah Reddy Road, West Mambalam, Chennai - 33.
Phone : 91-44-24742091, 91-44-23716322, 91-44-24894145 - Tele Fax : 91-44-23716322
**www.pramukhandhra.org/E.mail : pramukhandhra95@gmail.com**
**YEARLY SUBSCRIPTION : RS. 216/- PROMOTERS SUBSCRIPTION : RS. 2116/-**

## తెలుగు కథకొక అంతర్జాతీయ ఖ్యాతి తెచ్చిన
# పాలగుమ్మి పద్మరాజు



మా పినతల్లిగారి అబ్బాయి కీ॥శే గన్నవరపు జగన్నాధరావు భీమవరంలోని డబ్ల్యు.జి.బి. కాలేజీలో చదువుకునేవాడు. వాడికి కెమిస్ట్రీ లెక్చరరుగా పాలగుమ్మి పద్మరాజు పనిచేయడం నాకు బాగా తెలుసు. అప్పటికాయన కథారచయితగా పేరొందిన గుర్తు లేదు. 'గాలివాన' అనే ఓ కథ ఆయన్ను అమాంతం మద్రాసు సినిమారంగానికి నెట్టేసింది. దేవులపల్లి కృష్ణశాస్త్రి గారి అనుబంధం, ఆయన ప్రతిభ ఆయన్ను వాహినీ ప్రొడక్షన్సు వారి కథారచనా విభాగంలో ఒకటి చేసింది. అక్కణ్ణుంచీ అప్రతిహతంగా కథ, మాటల రచయితగా సాగిపోయింది. ఆయన విశ్వవిఖ్యాతి నొందుతారనీ, తెలుగు కథ (గాలివాన) కొక విశిష్టత తెస్తారని ఎవరూ ఊహించలేదు.

చలనచిత్ర కథా రచయితగా, దర్శకుడిగా తనకంటూ పద్మరాజు ప్రత్యేకస్థానం ఏర్పరచుకున్నారు. పశ్చిమగోదావరి జిల్లాలోని తిరుపతిపురంలో జూన్ 24, 1915న పుట్టారు. బి.ఎస్.సి. వరకూ రాజమండ్రి, ఎంఎస్‌సి కాశీ విద్యాలయంలో చదువుకున్నారు. ఆయన 23వ యేట రాసిన తొలి కథ 'సుబ్బి' భారతి పత్రికలో ప్రచురింపబడింది. దీన్నే ఆంగ్లంలోకి అనువదించిన 'త్రివేణి' పత్రిక ప్రచురించినప్పటి నుండి రచయితగా ఆయన రచనా ప్రస్థానం మొదలయ్యింది.

1939లోలో కాకినాడ కాలేజీలో డిమాన్‌స్ట్రేటర్‌గా, ఆ తర్వాత లెక్చరర్‌గా, భీమవరం కాలేజి కెమిస్ట్రీ శాఖకు అధిపతిగా పనిచేశారు. కాకినాడ కాలేజీలో పనిచేస్తున్నప్పుడు అక్కడున్న లైబ్రరీ పద్మరాజు సాహిత్య ప్రీతికి దోహదపడింది. దేవులపల్లి కృష్ణశాస్త్రి కూడా అదే కాలేజీలో పనిచేస్తుండేవారు. వీరిద్దరి పరిచయం స్నేహంగా మారింది.

రేడియో నాటకాలు, ప్రసంగాల కోసం పద్మరాజు తరచు మద్రాసు వెడుతుండేవారు. 'పట్నవాసం' అనే సీరియల్ నాటకం రేడియోలో ఆరునెలలపాటు వారం వారం ప్రసారమయి ఎంతోమందిని ఆకట్టుకుంది. ఇందులో ముఖ్య పాత్ర 'షావుకారు' జానకి పోషించారు.

1948లో విజయా అధినేతలలో ఒకరయిన చక్రపాణితో పద్మరాజుకు పరిచయంకాగా చక్రపాణి సారథ్యంలో వచ్చే 'ఆంధ్రజ్యోతి'లో కథలు రాసేవారు. ఆయన రాసిన 'పడవ ప్రయాణం' కథ భారతీయ భాషలతోపాటు ఆంగ్ల, జర్మనీ, ఫ్రెంచి, రష్యన్ భాషలలోకి అనువదింపబడింది. 1952లో రాసిన 'గాలివాన' కథ ప్రపంచసాహిత్యంలో కథకుడిగా పద్మరాజుకు విశిష్ట స్థానం కల్పించింది. న్యూయార్క్ హెరాల్డ్ ట్రిబ్యూన్ పత్రిక ప్రపంచ వ్యాప్తంగా జరిపిన కథల పోటీలో 'గాలివాన'కు ద్వితీయ బహుమతి. (ఆ రోజులలోనే వెయ్యి డాలర్లు) వచ్చింది. 22 ప్రపంచ భాషలకు సంబంధించి జరిగిన ఈ పోటీలో విజయం సాధించి కథకుడిగా తన కథా బలిమిని పద్మరాజు చాటుకున్నారు.

## చిత్రరంగ ప్రవేశం

సినిమా టెక్నిక్ మీద ఆసక్తి ఉండేది. పుడోవ్‌కిన్, ఐన్‌స్టీన్‌లు రాసిన పుస్తకాలు చదివి, సినిమా గురించి 'భారతి'లో కొన్ని విమర్శనాత్మక వ్యాసాలు రాశారు. కథ చెప్పడంలో నాటకం రాయడంలో గల ప్రతిభను దర్శక నిర్మాత బి.ఎన్. రెడ్డి గ్రహించారు. సినిమా కోసం ఒక కథ ఇవ్వమని అడిగారు. అలా 1952లో చిత్ర పరిశ్రమలోకి వాహినీ సంస్థ సంబంధం ఏర్పడటంతో అడుగుపెట్టారు. బి.ఎన్. దర్శకత్వంలో వచ్చిన 'బంగారు పాప' పద్మరాజు తొలిచిత్రం. 'బంగారు పాప' చిత్ర కథకు ఆధారం 'గాలివాన' కథేనని గోటేటి వారి అభిప్రాయం. తర్వాత వచ్చిన 'భాగ్యరేఖ', 'రంగుల రాట్నం' చిత్ర కథలు అప్పట్లో చర్చించినవే. రెండేళ్ళు సెలవుపెట్టి మద్రాసు వచ్చిన పద్మరాజు 'బంగారు పాప' చిత్రంతో చలనచిత్ర పరిశ్రమలోనే స్థిరపడిపోయారు.

ఆ తర్వాత 'భాగ్యరేఖ' 'భక్తశబరి' 'రంగుల రాట్నం, 'భక్తకుచేల', 'గ్రామదేవతలు', 'సుఖదుఃఖాలు', 'బంగారు పంజరం', 'చుట్టరికాలు', 'పాడవోయి భారతీయుడా', శ్రీరాజరాజేశ్వరీ విలాస్ కాఫీ క్లబ్' తదితర చిత్రాలకు పద్మరాజు రచన చేశారు. బి.ఎన్. దర్శకత్వంలో విజయా సంస్థ నిర్మించ తలపెట్టిన 'లవకుశ' చిత్రం కోసం పద్మరాజు స్క్రిప్ట్ తయారు చేశారు. అయితే ప్రాజెక్ట్ ఆ ప్రారంభం కాలేదు.


రాజమండ్రిలో పద్మరాజు సహాధ్యాయుడైన సరిదే భావనారాయణ చిత్ర నిర్మాణం చేపట్టినపుడు ఆయన కోరికపై 'గోపాలుడు- భూపాలుడు', 'పాల మనసులు', 'సర్కార్ ఎక్స్‌ప్రెస్', 'దేవుడిచ్చిన భర్త', 'మా నాన్న నిర్దోషి' చిత్రాలకు రచన చేశారు. అలాగే భావనారాయణ కన్నడంలో నిర్మించిన 'సింహస్వప్నం' చిత్రానికి ఆయన స్క్రీన్‌ప్లే రాశారు. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడెమీ అవార్డ్ పొందిన పద్మరాజు నవల 'నల్లరేగడి' ఆధారంగానే కృష్ణ, జయప్రద నటించిన 'మనవూరి కథ' చిత్రంగా రూపుదిద్దుకుంది.

పద్మరాజు రెండు చిత్రాలకు దర్శకత్వం వహించారు. 'బికారి రాముడు', 'దేవుడిచ్చిన భర్త'. ఈ చిత్రాలు విజయవంతం కాలేదు. అలాగే రంగస్థల సినీ నటుడు నాగభూషణం కోసం రెండు నాటకాలలో ఒకటయిన 'రక్తకన్నీరు' ప్రేక్షకులను ఎంతో ఆకట్టుకుంది. తమిళంలోని 'రక్తకన్నీరు' నాటకమే ఆధారం. తమిళంలోని ఎం.ఆర్. రాధా పాత్రను నాగభూషణమెంతో చక్కగా నటించారు. ఇందులో పద్మరాజు డైలాగులు బాగా ప్రాచుర్యం అయ్యాయి. మరో నాటకం 'బికారి రాముడు' సినిమాగా రూపుదిద్దుకుంది.

దాదాపు మూడు దశాబ్దాల పాటు రచయితగా చిత్రపరిశ్రమతో మూడు తరాల దర్శకులతో ఆయన అనుబంధం కొనసాగింది. అందరితోనూ చక్కని సంబంధ బాంధవ్యాలు ఏర్పరచుకున్నారు. ప్రముఖ దర్శకుడు దాసరి నారాయణరావుకు పద్మరాజు అంటే ఎంతో గౌరవం.

తన జీవితాన్నంతా సాహిత్యానికే అంకితం చేసిన పద్మరాజు ఫిబ్రవరి 17, 1983న తుదిశ్వాస విడిచారు. డాక్యుమెంటరీ పోటీలకు ఆకాశవాణి న్యాయనిర్ణేతగా వ్యవహరించడం కోసం ఢిల్లీ వెళ్ళిన పద్మరాజుకి జీవన యాత్రలో అదే చివరి రోజయింది. డాక్టర్ సి. నారాయణరెడ్డి అన్నట్టు 'గాలివాన' ఉన్నన్నాళ్లూ పద్మరాజు పేరు సాహితీరంగంలో అజరామరంగానే ఉంటుందన్నది వాస్తవం. ●

# మహానటుడు ముదిగొండ లింగమూర్తి



'వెంకన్న కాపురం' నాటకం రిహార్సల్సు వారి డాబాయింటిపై నున్న పాకలో చేస్తున్న సమయంలో లింగమూర్తిగారిని కలిసాను. అటు తరువాత ఆయన డా॥ గాలి బాలసుందరరావుగారి చికిత్సాలయానికి (స్నేహంగా సుమండీ) వస్తూండేవారు. మహానటుడు చిత్తూరు వి. నాగయ్య లింగమూర్తిగార్లు పరస్పరం బావా బావా అని ప్రేమగా పిలుచుకునేవారు. అయితే లింగమూర్తికి ఒకరి దగ్గరకు వెళ్ళి వేషాలడిగే అలవాటు లేదు. ఆయన వద్దకే వచ్చి పలానా పాత్ర ఉందని వచ్చి చెప్పినవారి చిత్రాల్లోనే నటించారు.

కొంతకాలం చిత్రాలు లేనపుడు కూడా ఆయన బాధపడలేదు. వ్యక్తి గౌరవానికి భంగం కలిగేట్టెపుడూ ఆయన ప్రయత్నించలేదు.

నన్నెంతో అభిమానించిన సౌహృదయుడు. నా పుట్టిన రోజులకు నాయింటికి వచ్చిన ఆశీర్వదించిన సంస్కారి.

కాసు కోసం గాకుండా వాసిగల పాత్రలనే ఆయన ధరించేవారు. ధరించినా పాత్రను లింగమూర్తి ధరించి పోషించలేనట్టుగా నటించేవారు. వారు వాహినీవారి 'సుమంగళి'లో భానుమతి తండ్రిగా నటించిన ఆ పల్లెటూరి బైతు పాత్ర నా స్మృతిపథంలో నిలిచిపోయింది. సీయస్సార్ తక్క ఏ ఒక్కరూ ధరించలేరన్న శకుని పాత్రను అద్భుతంగా నటించారు. 'మహాకవి కాళిదాసు'లో రాజకుమారి తండ్రి మహారాజుగా నటించిన పాత్ర, 'యోగివేమన' (వాహినీ చిత్రం) అభిరాముని పాత్ర–యిలా ఎన్నెని చెప్పను.

లింగమూర్తిగారు తెనాలి వాస్తవ్యుడే. సుప్రసిద్ధ నటులు గోవిందరాజుల సుబ్బారావూ, మాధవపెద్ది వెంకట్రామయ్యగార్లతో కలిసి ఎన్నో నాటకాల్లో నటించారు. నాటక రచయితగా ఆయన రచించిన వెంకన్న కాపురం, పెళ్ళి చూపులు నాటకాలెన్నో ప్రదర్శనలు జరిగాయ్. 1937 వ సం॥ములోనే 'భక్త తుకారం' చిత్రంలో నటించారు. వాహినీ సంస్థతో లింగమూర్తిగారికి మంచి అనుబంధం ఉన్నది.

1908 అక్టోబర్ 10 న తెనాలిలో జన్మించారు. 1980 జనవరి 24న కాలధర్మం చెందారు. మద్రాసు వచ్చినప్పట్నుంచీ మద్రాసే ఆయన నివాసస్థలం. ఆయన మద్రాసును విడిచిపెట్టి యెక్కడకూ వెళ్ళలేదు. సినిమా నటుడు చంద్రమోహన్‌ను పరిచయం చేసిందీ ఆయనే! నాటకాభిమానీ, సినిమా ప్రముఖుల వైద్యుడైన డా॥ బాలసుందరరావుగారి కుమార్తె జలంధరతో వివాహం జరగడానికి కారణమూ లింగమూర్తిగారే!

ఆయన సినిమా పాత్రల్లో ఎంతగా లీనమై నటించేవారో నిజజీవితంలో సాంప్రదాయానికీ, ఆధ్యాత్మిక జీవితానికీ అంతే ప్రాధాన్యత యిచ్చేవారు. ఆయన సతీమణి దుర్గవర్ధనమ్మ పోయిన తరువాత సన్యాసాశ్రమం స్వీకరించారు.

ఇంతటి మహోన్నత వ్యక్తి మరల జన్మించరు.

– గోటేటి

## ప్రముఖాంధ్ర అభిమానులకు ఆహ్వానం, అభ్యర్థన!

ప్రముఖాంధ్ర గత 28 సంవత్సరాలుగా నిరాటంకంగా వస్తూనే వుంది. ఎందరో అభిమానులు ఏ పరిమాణంలో సహాయం అందించాలని ఫోన్లు చేస్తున్నారు? 'వేలు'గా ఇవ్వ అవకాశం లేని అభిమానులున్నామంటున్నారు.

అలాటి మహోదయులకు, మహా హృదయులకూ పరిమితి లేదు, పరిధి లేదు. మీ శక్తికి తగినట్లు, మీ మనసుకు తోచినట్లు సహాయ సహకారము లందచేయండి! ప్రతా ఒక్క నీటిబొట్టూ కూడితేనే ప్రవాహమవుతుందీ, జీవనదీ అవుతూంది. చేరిన ప్రతీ నీటిబొట్టునూ దాచుకొని సాగరం తిరిగి మేఘమై, మేఘం వర్షమై చినుకు చినుకుగా భువినెలా సస్యశ్యామల కోమలం చేస్తూ పంటలను పండిస్తూందో – మేమూ అలానే మీ ప్రతీ 'రూక'నూ ప్రముఖాంధ్రుల భాషా సేవకే వినియోగిస్తాం. 'ప్రముఖాంధ్ర'ను పంట పొలంగా చేసి, తెలుగు అక్షర విత్తులను పండిస్తాం. ఇదే మా వినతి! ఇదే మా అభ్యర్థన. ఇదే మా హృదయపూర్వక ఆహ్వానం. పోస్టు ద్వారా ఉత్తరాలు వ్రాసి ఉన్న దబ్బులను కూడా హరింపచేయలేం. గ్రహించండి.

**రూ. 1001, 2001, 5001, 10,001, 25,001, 50,001 మీ ఇష్టం ఎంతైనా**

ప్రముఖాంధ్ర బ్యాంక్ వివరాలు :

| | | |
|---|---|---|
| Account Name | : | PRAMUKHANDHRA |
| Account No | : | 20011102592 |
| Bank | : | BANK OF MAHARASTRA, T.NAGAR |
| IFSC Code | : | MAHB 0000450 |

**ప్రముఖాంధ్ర**

64, తంబయ్యరెడ్డి వీధి, వెస్ట్‌మాంబళం, చెన్నై – 33.

మొబైల్ : 98400 48941

# వేదమాత! ఆయుర్వేదమాత ఒకరే!

## వ్యాసుడులేనిచో వేదముల్లేవు - చరకుడుల్లేకపోతే ఆయుర్వేదమే లేదు

విశ్వానికి ప్రకృతే వైద్యాలయమనీ, ప్రకృతిపై మొలచిన భూమిలో వేళ్లానుకుని వున్న వనసంపత్తిలోనే ఔషధాలున్నాయని భారతదేశమే తెల్పిచెప్పినది!

ఏ దేశానికీ లేని గొప్పదనం భారతదేశానికున్నది. వేదాల్ను ఎవరో వ్రాయలేదు. వ్యాసఋషిప్రోక్తం. వేదముల్లోని అంతర్వేదమే ఆయుర్వేదం.

మనిషి నూరేండ్లు గాకుండా నూటయిరవై ఏండ్లు బ్రతకాలన్నది శాస్త్రం. చాలామంది తెలుగు యోగులే రెండుమూడు వందలయేండ్లు జీవించారు. ఈ విషయాన్ని కుర్తాళం పీఠాధిపతి శ్రీశ్రీ సిద్ధేశ్వరానంద భారతీ స్వామివారు కూడా తమ ఉపన్యాసముల్లో సిద్ధీకరించినట్లు చెప్పారు. ఇప్పటికీ హిమాలయ పర్వతాల్లో దృశ్యాదృశ్యంగా వారున్నారు. త్రేతాయుగం నాటి ఆంజనేయులు వారు హిమవత్పర్వతాల్లో తిరుగుతున్నారు. నిజానికి ఆయన వైద్యులు కన్నా గొప్ప వైద్యుడు. పర్వతంతో సహా సంజీవనీ మూలికామొలకను తెచ్చి, లక్ష్మణుని ప్రాణాలను కాపాడారు. రామరావణ యుద్ధంలో విగత జీవులైన వానరుల్ని ఈ మూలికలు, ఆకుపసర్లే బ్రతికించాయ్. నా చిన్నపుడు చెవిపోటువస్తే రుద్ర జడాకు రసం పిండిపోసేవారు! అరటి, పనస, బాదం, తమలపాకుల్ని నూనె కానీ, ఆముదం కానీ రాసి, నిప్పుసెగ చూపించి, నొప్పివున్న శరీరభాగానికి కట్టేవారు. పసరు వైద్యంచేసేవారు. వాత, పిత్త, కఫములను నివారింపచేసేవారు.

కొన్ని సంవత్సరాల క్రితం, నేను చింతలూరు వెళ్లినపుడు– శ్రీవెంకటేశ్వరా ఆయుర్వేద నిలయం, వారిఆలయంలో ఎన్నో ఆకుల్ని నిక్షిప్తంచేయడం చూశాను. ఈ విషయంలో ద్విభాష్యం శ్రీరామమూర్తి (మేనేజింగ్ డైరెక్టరు) నాకు సహకరించారు. వారి తాతతండ్రులీ వైద్య ప్రదాతలు, కేసరిగారు మద్రాసులో స్త్రీల గర్భాశయ



వ్యాధులకు 'లోధ్ర' అనే ఓ కషాయాన్ని సీసాల్లో విక్రయించేవారు.

మా నాన్నగారైన గోటేటి విస్సంరాజుగారు బంగారాన్ని పుటం వేసి స్వర్ణ కాంతవల్లభ రసం, వసంతకుసుమాకరం వాడేవారు. ఆయన స్వయంగా తయారుచేసిన అగ్నితుండితో సర్వజ్వరాలను నివారింపచేసేవారు. ఆయుర్వేదంలో నివారణ కాని వ్యాధులంటూ లేవు. ముఖ్యంగా ఆయుర్వేదానికి భూమిపైనా, భూమిలోనున్న తీగలూ, వేరులే ప్రధాన ఔషధ మూలికలు. పొట్టి శ్రీరాములు గారు చివరివరకూ ఆయుర్వేద ఔషధాలనే తీసుకునేవారు. ఆ రోజుల్లో డా॥ కస్తూరి నారాయణమూర్తిగారూ, ఆచంట రుక్మిణీపతి వంటి ప్రసిద్ధ ఆయుర్వేద వైద్యులుండేవారు. రక్తపరీక్షలకుగానీ, రక్తపోటుకుగానీ, క్షయనుగానీ పరీక్షించి చెప్పడానికి చికిత్సా పరికరాలు లేవు. చేతినాడిని జూచే రోగనిర్ధారణ చేసేవారు. ఈ నాటికినీ ఇంగ్లీషు వైద్యంలో, హోమియో వైద్యంలో నాడిని, నాడి వేగాన్ని (పల్స్‌రేటు) చూడకుండా ఉండే వైద్యులు లేరు. స్టెతస్కోపు పెట్టుకోకుండా గుండెను పరిశీలించలేరు.

ఇదేదో కొత్త విధానం చెడ్డదనీ, పాతవిధానం శ్రేష్ఠమైనదనీ చెప్పడానికీ వ్యాసాన్ని ఉద్దేశించలేదు. కానీ, వేదం ప్రాతిపదికగానే వైద్యాలు పుట్టాయ్. శస్త్ర చికిత్సలకు కూడా ఆనాటి శస్త్రచికిత్స ప్రాతిపదికనే వచ్చాయ్. ఈ రోజు యిచ్చే మత్తు మందులకు బదులు ఆ రోజుల్లో ద్రాక్షరసం త్రాగించేవారు.

మూలాల్ని మరవడం మన నైజం. మన మూలికలతోనే ఇంగ్లీషు మందులు తయారవుతున్నాయ్. మనవాడు డా॥ సుబ్బారావు పెన్సిలిన్ కనిపెట్టాడు. మన వాడు నోరి దత్తాత్రేయులు, ఇమంది వెంకట్రావులు అమెరికాలో కాన్సర్ స్పెషలిస్టులు, మన పోలవరపు తులసీదేవి, గెద్దం దశరథరామిరెడ్డి, గంటి సుబ్రహ్మణ్యం గారలు అక్కడ ప్రముఖ వైద్యులు (కొందరి పేర్లు నాకు తెలియకుండా ఉండవచ్చు)

ఇంగ్లాండులోని డాక్టర్లందరూ మనవాళ్ళే, దుబాయ్, సింగపూర్, కౌలాలంపూర్‌ల్లో మన డాక్టర్లే మేటి డాక్టర్లు. ప్రపంచదేశాల్లో వెదికి వెదికి పట్టుకుంటే దేశానికి పదిమందైనా మన డాక్టర్లుంటారు. ఈ డాక్టర్ల ఆధునిక వైద్యానికి ప్రాతిపదిక ఆయుర్వేదం, ఆయుర్వేదం చతుర్వేదాల్లోని అంతర్వేదం. – గోటేటి

# పరోపకారమే పుణ్యం! పరులకు అపకారంచేయడం పాపం

ప్రాతః కాల సంజెలో పాతచెట్లు చివుళ్ళు తొడగడం చూచి పుట్టే పువ్వులు కిలకిలా నవ్వుతూ– మేము వికసించి పిందెలను కాయించాలి. పిందెలు కాయలు, కాయలు పక్వత పొందిన తరువాతనే ఫలాలు సిద్ధి వుంటుంది. చివుళ్ళు తొడిగి, పూలూ, పిందెలు, కాయలుగా మారడానికి పట్టేకాలంలో నేల చదును చేసి, వేల ఆసనములు వేసి, లక్షల జనం రావాలని, కోట్లు జేబులు దులుపుకుంటూ కోట్లను ఖర్చు పెడుతున్నపుడు, ఓటువేసిన మీవారలు మీరజాలగలరా మా ఆనతియని రోట్లన్నిటిపై, మీ లోడ్లతో నింపితే, రోజువారీ కృత్యాలకు తిరిగే జనం మాటేఁవిటని ఆలోచించలేదే! ఆ డబ్బును జనక్షేమ కార్యక్రమానికి ఖర్చుపెడితే క్షామాన్ని కొంతయినా ఆదుకోవచ్చు కదా! నడిచివచ్చిన నడకదారిని నెమరు వేసుకోండి? ఈ ఋషికృత్యంలో 'ఏతేషాం భూమి భారకా – అన్న ఒక వాక్యమును వ్యాఖ్యా నించుకోండి చాలు!

కంటికి కనిపించని ప్రాణులెన్నో కాళ్ళక్రింద నలిగిపోతుంటాయి. వాటన్నిటి దోషం తొలగేలా ఓ మంత్రాన్ని కానీ, మంత్ర భావాన్ని (పశ్చాత్తాపం) కలిగి ఉండమన్నారు. భూమినీ, గిరుల్నీ మారక మందులు పెట్టి పేల్చడం ఘోరం.

పాపభీతి, దైవభక్తిగల తెలుగుతనాన్ని పునరుద్ధరించండి.

**పాపము మన చేతుల్లోనే ఉంది!**
**పుణ్యమూ మన చేతుల్లోనే ఉంది!**
**పరోపకారమే పుణ్యం–**
**పరులకు హాని చేయడమే పాపం!**





# కాంతమ్మ ఎవరు తాతయ్యా! నాకూ అడగాలనే వుంది!

## -నేను ఆయన్ను తెలుసుకోవాలనుకొనేసరికి ఆయన చనిపోయారు-

ఆయనెవరో కాదు 'కాంతం కథలు' సొత్తయిన మునిమాణిక్యం నరసింహారావుగారు. ఆకాశవాణిలో ఆయన చాలా కాలం పనిచేసేవారు.

మునిమాణిక్యం వారికీ నాకూ సాపత్యమేమంటే- మా యిద్దరివద్దా కుప్పలు కుప్పలుగా పెన్నులు (ఇప్పుడు బాల్ పెన్నులూ- జెల్ పెన్నులూ అనుకోండి) ఆయన రోజుకో పెన్ను కొనుక్కుని వెళ్ళేవారు- ఎక్కడో మరచిపోయి మరో రోజో పెన్ను కొనేవారు. ఒకసారి- అనుకుంటాను- 'ఇవిగోండి మునిమాణిక్యం గారూ- మీరు విడిచిన పెన్నులివిఁవిగో అంటూ ఓ పెద్దకుప్పగా పెన్నులు పోగు పోసారు.



ఆయన మరచిపోయి రోజుకో పెన్ను కొనేవారు, నేను మనసుపడి రోజుకో పెన్ను చేరుస్తాను.

కాంతంపైనే యెక్కువగా ఆయన మనసు కథలు సాగేవి. ఆ కాంతం ఎవరో తెలుసుకోవాలనే ఉత్సుకత మీకు ఉందా? నాకూ ఎంతో కాలంగా ఉండేది. ఇదే ఉత్సుకతను వారి మనుమరాలుకూ ఉండేది. ఓసారి తాతయ్య చెప్పిన కథలను వ్రాస్తూ- "కాంతం ఎవరు తాతయ్యా? మా నాన్నమ్మ శేషగిరి అమ్మా? లేక యిప్పు డున్న రాజ్యలక్ష్మి నాయనమ్మా? అని అడిగింది.- అంటే వారి మనుమరాలికే 'కాంతం' తెలియ దన్నమాట.

'ఓసినీ బంగారం కానూ! అని మనుమరాలి వీపును స్పృశించి- భలేగా అడిగావే- ఈ నాయనమ్మా కాదు, ఆ నాయనమ్మా కాదే! అనగానే ఆ మనుమరాలు సమాధానం ఎదురుచూడడం చూచి, ఉత్తమ లక్షణాలు కల కాంతిపుంజంలా వుండే నా ఊహా గృహిణి అన్నారు తాతయ్య.

మునిమాణిక్యం నరసింహారావుగారు ఛలోక్తులు రువ్వే రచయిత. అప్పట్లో చిలకమర్తివారు, పానుగంటివారు నోరివారు, మునిమాణిక్యం వారినీ- వెరశి ఐదుగుర్నీ పంచ సింహాలనేవారు. భీకరత్వంలో కాదు సుమండీ- సున్నిత హాస్యాన్ని




పండించడంలో సుమండీ. మొక్కపాటి, భమిడిపాటి వారు హాస్యబ్రహ్మలుగా ఉండేవారు. కానీ వారి హాస్యలాస్యాలను చాలామంది మరచిపోయారు. హాస్యబ్రహ్మ- ఎవరురా అంటే జంధ్యాల అనేవారు. ఆయన్నూ మరచి ఆయన పరిచయం చేసిన బ్రహ్మానందంగారిని హాస్య రస సామ్రాట్ అంటున్నారు. తరాలు మారినకొద్దీ, కొన్ని తరాలవారిని మరచిపోవడం జననైజం.

మునిమాణిక్యం వారిని ఎందుకు చెప్పాల్సి వచ్చిందంటే మొన్న మొన్నటివరకూ 1973 ఫిబ్రవరి వరకూ ఆయన ఉన్నారు. **'భార్యను లొంగదీసుకోవడం ఎలా'** పుస్తకం మునిమాణిక్యం కథలూ చదివినవారికి ఆయన మన మనసుల్లో ఉండనే ఉంటారు.

అయితే ఒకటండోయ్ శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషానిలయం, సారస్వతపరిషత్తు, సాహిత్య అకాడమీ లాంటి ఎన్నో సంస్థలు ఆయన్ను గౌరవించాయ్. సినిమా రంగంల జోలికి ఆయన పోలేదు. ఆయన జోలికి సినిమారంగం రాలేదో తెలియదుగానీ, ఆయన్ను ఆకాశవాణి రంగం పాదాలకు పారాణి పూసుకున్నంత చక్కగా పూసుకుంది. ఇంతకూ వారి సతీమణి పేరు చెప్పకపోతే 'కాంతం' అనే పేరు పొరబడతారని చెబుతున్నా ఆమె పేరు రాజ్యలక్ష్మి. ఈ సమాచారం అందించిన శేషుకుమారి ఆయన మనుమరాలు. ●

# అధ్యయనంతోనే భరద్వాజ మహర్షి 3 జన్మలనూ గడిపారు!

భరద్వాజ మహర్షి పేరుగల గోత్రమ్మాది. విమానశాస్త్రమును విశదీకరించిన మహర్షి అనే కన్నా - ఆయనే ఆద్యుడని చెప్పాలి. అలాటి విజ్ఞతగల మునుల మార్గంలోనే అన్వేషణం చేయాలి.

వేదాధ్యయనంతోనే ఇవన్నీ సాధ్యమవుతాయ్. నిరంతరపఠనం, నిరంతర శ్రవణం, అనుష్టానం చేయాలి. భరద్వాజమహర్షి భగవత్కృపతో మూడు జన్మలెత్తారు. మూడు జన్మలలోనూ వేదాధ్యయనమే. దేవలోకానికి ఈ మహర్షి నిరంతర అధ్యయన కృషి తెలిసింది. దేవేంద్రుడు విస్మయుడు కావడం కాదు. వెంటనే స్పందించాడు. భూలోకమునున్న భరద్వాజ మహర్షికి దర్శనమిచ్చాడు. 'మునిశ్రేష్టా! నీ వేదాధ్యయన విజ్ఞానం విని వచ్చాను. నీకు మరోజన్మను ప్రసాదిస్తే-ఏంచి చేస్తావని ప్రశ్నిస్తే నిరంతర విద్యార్జన కోసం వేదాధ్యయనం చేస్తాను అన్నాడు. ఎంతకాలమని అధ్యయనం చేయగలవు? వేదములు అనంతములని ఎరుగవా? అనగానే నా జీవితాన్ని విద్యార్థిగా గడపడానికే యత్నిస్తాను అన్నారు. ఇంద్రుడూ మహర్షి విద్యాకుతూహల మెరిగి సుగుణోపాసన ఉపదేశించాడు. విజ్ఞానాన్ని సంపాదించు కోవడంతో బాటు, సుగుణ గుణ సంపన్నతను పెంచుకోవాలి. ఎంత పాండిత్యం సముపార్జించినా, ఇంకా తెలుసుకోవలసినది ఉందని భావించాలి.

ఇందుకో ఉదహరణ చెప్పారు గురువులు. దూర్వాస మహాముని సమస్త శాస్త్రాలూ అభ్యసించా నని బండెడు గ్రంథాలతో శివసన్నిధికి వచ్చాడు - అక్కడున్న నారదముని, గాడిద బరువు మోసినట్లు అన్ని గ్రంథాలు మోసు కొస్తున్నారేమిటి- యని ఎగతాళి చేయగా, గార్ద భం మోసే బరువు గార్ద బానికే తెలుస్తుందన్నట్టు చూడగానే ఆత్మజ్ఞానం లేనివానికి ఎంత జ్ఞానం




ఉండి ఏంప్రయోజనం; అనుకున్నాడు. భరద్వాజ మహర్షి వేద విజ్ఞానంతోపాటు ఆత్మజ్ఞానం కలిగి ఉన్నందుననే శ్రీరామచంద్రునికెన్నో అస్త్రాలు ప్రసాదించగలిగాడు. ఎంతమంది శిష్యులను జ్ఞానుల్ని కావించాడు. పాండిత్యం రాణించాలంటే ఆత్మజ్ఞానం అవసరం అదిలేకనే దేశనాయకులు దేశాన్నీగతికి తెచ్చారు. ●

# నిరాడంబర వివిక్త నిష్కళంక కవి- 'మధుర' కవి నాళం

**"శిరము నేటికీ
వంచెదే చిన్న పువ్వ!
పరుల దృష్టి పథంబునఁ
బడకయుండ?
ఇంచుకొకసారి నెమ్మోము
నెత్తితేని
జనులు తమ కన్నుఁగవ
నద్దుకొనరె నిన్ను?"**

చిన్ని పువ్వుని మధురకవి నాళం కృష్ణారావు. తేనె చినుకులు కావ్యంలో కృష్ణారావు చేసిన ప్రశంస. ఆయనకే సరిగి అతికినట్లు సరిపోతుంది. చిన్ని పువ్వు సొంతం అయినట్లు **'నిరాడంబర వివిక్త నిష్కళంక జీవితం'** కృష్ణారావు సైతం సొంతం చేసుకున్నారు.

తెలుగులో ఎవరికీ తీసిపోని కార్యదక్షుడు నాళం కృష్ణారావు 1881వ సంవత్సరం జనవరి 18వ తేదీన నాళం కామరాజు, లక్ష్మమ్మల చివరి సంతానంగా తూర్పుగోదావరి జిల్లా మండపేట గ్రామంలో జన్మించారు. భాగ్యవంతుల యింట పుట్టినా అధోజగత్స హోదరుల కోసం మనసావాచా కర్మణా పరితపించిన విశిష్ఠ వ్యక్తిత్వం. కృష్ణారావుగారి జీవితసారాన్ని ఒక్క మాటలో చెప్పాలంటే 'మానవసేవ' అని చెప్పాలి. 1911-15 ప్రాంతాల్లో ఆయన నిర్వహించిన తొలి తెలుగు సచిత్రమాస పత్రిక పేరు 'మానవసేవ'. పద్దెనిమిదవ శతాబ్దంలో విలసిల్లిన ఆంధ్ర సామాజిక పునరుజ్జీవనం (సోషల్ రినైజాన్స్) నాళం కృష్ణారావును నిలువెల్లా ఆవహించి ఆయనచేత 'మానవసేవ' చేయించదలచింది. ఆయన పదిహేడో ఏట రాజమండ్రిలో గ్రంథాలయాన్ని స్థాపించడం, స్త్రీ విద్యను వేగతరం చేయడం, బ్రహ్మసమాజ మతస్థుడిగా గురువుగా కీర్తింపబడిన కందుకూరి వీరేశలింగం పంతులుగారి కన్నా ముందే జంధ్యాన్ని పరిత్యజించి అట్టడుగు కులస్థుడికి తన యింట్లో నివాసం ఏర్పరిచారు. ఇతర కులస్థులతో తన పెద్ద కుమారునికి వివాహం జరిపారు. వితంతు వివాహాలు జరిపించారు. క్రియాశీల పాత్ర పోషించడం- ఆయన 'మానవసేవ'లో కొన్ని మాత్రమే! రఘుపతి వేంకటరత్నం, కందుకూరి వీరేశ లింగం పంతులు, ఆశయాలు, వాటి సాధనాలు నాళం కృష్ణారావు గారిలో ప్రతిఫలించాయి. మహాత్ముని బోధనలతో కృష్ణారావుగారి ఇల్లంతా ఖాదీ వస్త్రధారణతో నిండింది. కృష్ణారావుగారి ధర్మపత్ని సుశీలమ్మ గారు తమ విదేశీ వస్త్రాలన్నీ దహనం చేసి నూలుతో వడికిన వస్త్రాలు ధరించారు. మహాత్ముడు రాజమండ్రి వచ్చినప్పుడు ఆయనకు పండ్ల రసం అందించారు.



కృష్ణారావు లాఠీఛార్జి, జైలుజీవితం మరొక పార్శ్వం సాహిత్యం. లేబ్రాయం నుండి జీవితపు తుదిశ్వాస వరకు తేటగీతులలో కావ్యరచనం చేశారు. కృష్ణారావుగారి ఆశలన్నీ భావిభారత పౌరులపైనే ఉండేవి. అందుకే ఆయన కావ్యనాయకుడు పిల్లవాడు. వారికి ఆయా 'గోరుముద్దలు', 'మీగడ తరగలు', 'వెన్నె బడుగలు', 'పాల తరగలు' 'తేనె చినుకులు' తినిపించారు. 'వెన్నెల వెలుగులు', 'విరిదండ', 'దీపావళి' 'పాపాయి' లను అందించారు.

పిల్లలపై చూపే మాధుర్య గుణమే ఆయనవనీ మధురకవియని రాయప్రోలు సుబ్బారావు గారిచే ప్రశంసించింది. తేట తెలుగుకు ఆయన తేటగీతులే చిరునామాలు, క్లుప్తత, శుభ్రత, శ్రావ్యతల మేళవింపునకు అద్దాలు. తన కవిత గురించి, తన తెలుగు గురించి కృష్ణారావు ఇలా ప్రత్యక్షర సత్యం చేశారు:

**"అందములు చిందుతీరు తీయములు గల్గిగ ముద్దు గులికెడు
నుడికాయరములు గల్గి లలిత జాతీయములు గల్గి యలరుచుండు తేటతేనియ యూట మా తెనుగు మాట".**

-పసిబిడ్డల కోసం మధుర రసకవితా పానీయం ఒక వంక అందిస్తూనే, మరొకవంక గాంధీ మహాత్ముని సారథ్యంలో తన బ్రతుకు పండిచుకున్నారు.

లలిత లలిత పదాలతో పిల్లల మనసులను చూరగొన్న కృష్ణారావు మంచి భాషావేత్త. పదివేల సామెతలు సేకరించారు. శ్రీకృష్ణరాయ ఆంధ్ర విజ్ఞాన సర్వస్వాన్ని సంకలనం చేసారు. పాండిత్య గరిమతో కందుకూరి వీరేశలింగం పంతులుగారి కుడిభుజమై, ఆయన స్థాపించిన హితకారిణీ సమాజానికి, విరేశలింగం పాఠశాలకు జీవితాంతం అధ్యక్షులుగా పనిచేశారు.

బాలసాహిత్య బ్రహ్మగా, తెలుగు బాలబాలికలకు ఆయన ఇచ్చే సందేశాన్ని తాను రచించిన 'జీవన గీతం'లో పొందుపరిచారు.

**"ఈ మహా విశ్వరణరంగ భూమియందు
జీవితంబను ప్రస్థాన సీమ నిలిచి
పిరికిపందల రీతిని పరుగులిడక
పోరుగాంచి గెలుపుమా వీరుడవయి"**

నాళం కృష్ణారావుగారికి సాహిత్యరంగంలో రావలసిన కీర్తి రాలేదనే విమర్శ సత్యదూరం కాదు. కృష్ణారావుగారి నిరాడంబరత్వం, కీర్తికాంక్షా రాహిత్య ములు కారణం కావచ్చు. ఆయన 'సేవ'కే ప్రాధాన్యం ఇచ్చిన మహా మనిషి!

**'ఎవరి నెఱుగల, ఎవరిచే నెఱుగ బడక
వానివలె నేను జీవింప వాంఛ సేతు,
ఎవ్వరును నాదు మృతికకు యేడ్వకుండ
ఏకతమ్మున కనుమూయ నిచ్చగింతు"** అని! ఆయన ఇచ్చ 1961 మార్చి 17న నెరవేరింది.

నాడు ఆంగ్ల సాహిత్యంలోని అనర్ఘపద్య రత్నాలను తెలుగు చేసి, అవి తెలుగువారివే అన్నంత జీవన సంస్కృతిలో మనల్ని సంగమింపచేసారు. తన అనంతరం మానవ సేవ చేయాల్సిందిగా, తన తనయ కళాప్రపూర్ణ ప్రఖ్యాత కవయిత్రి ఊటుకూరి లక్ష్మీ కాంతమ్మ గారిని పురమాయించారు. తాను మాత్రం పసిపిల్లలతో ఆడిపాడి వారిని అలరించడానికి రాజమండ్రి విడిచి దివిజపురికి ప్రయాణమయ్యారు.

**(కొలసాని సాంబశివరావు గారి వ్యాససారం)**



# హితం కోరేవాడే నిజమైన హితుడు

కె. మల్లిఖార్జున, బళ్ళారి

సమస్త ప్రాణులకు మేలు చేసేవాడు భగవంతుడితో సమానమవుతాడు. ఆ వ్యక్తి అందరికీ సన్నిహితుడే.

'మంచిని కోరేవాడు నిజమైన బంధువు హితం కోరేవాడు నిజమైన హితుడు. సాన్నిహిత్యం కోరుకునేవాడే నిజమైన సన్నిహితుడు' అని విజ్ఞులు చెబుతారు. హితవచనం పలికి తోటివారికి సహాయ సహకారాలను అందించడం ఉత్తముల లక్షణం, అటువంటి ఉత్తమగుణాలున్న వ్యక్తి అందరికీ ఆత్మీయుడై నిరంతర సేవాగుణం కలిగి ఉంటాడు.

ఎదుటి వ్యక్తి హితాన్ని కోరేవారు సద్భావనలో సమాజాన్ని సుభిక్షం చేస్తారు. మనం కోరకుండానే సూర్యభగవానుడు తన కిరణ స్పర్శ చేత పద్మాలను వికసింపజేస్తున్నాడు. చంద్రుడు తన ధవళ కాంతులతో కలువలను వికసింపజేసి లోకాన్ని ఆహ్లాదపరుస్తున్నాడు. ఎలాంటి ప్రతిఫలాపేక్ష లేకుండానే మేఘుడు లోకానికి జీవనాధారమైన వర్షపు జల్లులను ఇస్తూ పుడమిని పునీతం చేస్తున్నాడు. మన శరీరంలో పుట్టిన వ్యాధి ప్రమాదకరమైనదే. ఎక్కడో అడవిలో పుట్టినప్పటికీ మన వ్యాధిని పోగొట్టే ఔషధగుణాలున్న మూలిక మనకు ఆప్తబంధువే.

అలాగే సత్పురుషులూ ప్రతీక్షణం పరహితం కోరుతూ ప్రపంచశాంతి కోసం, సుఖం కోసం, సుభిక్షం కోసం పాటుపడతారు. మన హితాన్ని కోరుకునేవాడే సన్నిహితుడని, బంధువని, అలా ఉపయోగపడనివాడు శత్రువుతో సమానమని 'స్మృతి' చెబుతోంది. ఆపదలో ఉన్న దీనుణ్ణి కాపాడేవాడు మాత్రమే నిజమైన సన్నిహితుడని, కష్టాల్లో ఉన్నప్పుడు కూడా వెంటవుండి సహాయం చేసేవాడే నిజమైన బంధువని రామాయణంలో వాల్మీకి మహర్షి వివరిస్తాడు. అందుకే ఆత్మీయుడైనా, బంధువైనా చెడ్డవాడిని విడిచిపెట్టాలి. ఆదరాభిమానాలు ప్రదర్శించి, మన హితం కోరే వ్యక్తి పరాయివాడైనా, అతడినే అత్యంత ఆత్మీయుడిగా భావించాలి.



## గోవుని పూజించనివారికి గోష్పాదమంత పుణ్యం కూడా దక్కదు!

భారతదేశం పాప కలుషితం కావడానికి గోవులను నిరాదరించడమే! వృద్ధ గోవులను కబేళాలకు పంపి వధించడం, గోమాంస భక్షకులుండడం మహా దారుణం. నాగుపాముల్నీ, క్రూర జంతువులన్నీ విడిచిపెట్టేవారు, సాధు జంతువు గోవును చంపడం చోద్యం. నిజానికి జాతీయ జంతువుగా గోవును పేర్కోవాలి. గోవులోనే సకల దేవతలున్నారన్నది భారతీయుల విశ్వాసం. ఇప్పటికైనా గ్రహించండి. గోవుని పూజించండి.

## హితం కోరువాడున్నాడా- యని గోటేటి సందేహం!

ప్రముఖాంధ్రలో పుంఖానుపుంఖంగా నీతిధర్మశాస్త్రాల సారాంశాన్ని సమ్మూలంగా సంక్షిప్తంగా వ్రాస్తున్నాం!

అసలు హితం కోరువాడు స్వతంత్ర భారతదేశంలో ఉన్నాడా- అన్నదే ప్రశ్న. సనాతన ధర్మమొక్కటే సర్వధర్మములను గౌరవిస్తూ, సర్వవిశ్వజనుల క్షేమాన్ని గోరుతుంది. ప్రపంచ దేశాల్లో ధర్మానుష్ఠానికి సనాతన ధర్మం వినా వేఱులేదు. అనేక దేశాలవారు, అనేక మతాలవారు, అనేక భాషల వారు- ఒకరికొకరుగా బ్రతగలిగ్గారు. స్వతంత్రం వచ్చి స్వపాలన యేర్పడిన తరువాత ప్రభుత్వం, రాజకీయ నాయకులు దేశవిచ్ఛిన్నత్వానికీ, జనుల మధ్య విహితత్వానికి కారకులయ్యారు.

జాతీయతను చంపేసారు. ఇప్పుడు కాంగ్రెసువారుగా చెప్పుకుంటున్న వారు గానీ, కమ్యూనిస్టులు గానీ దేశస్వాతంత్ర్యోద్యమంలోనివారు కారు. ఇందిరాగాంధీ స్వయంగా కాంగ్రెసు తలుపులు మూసేశారు. దేశప్రియత్వంగల నాయకులుంటే దేశంలో హితం పెరుగుతుంది. దేశవిక్రయ భావం కల నాయకులున్నపుడు హితమూ పెరుగదు, సన్నిహిత్వమూ పెరుగదు.

రాముడితో యుద్ధానికి ముందు సభమధ్యలో సభికులను అడిగితే అప్పుడు కుంభకర్ణుడు "మహారాజా! సీతాపహరణమును ముందు నీవు చేసిన పనిని గురించి మాతో ఆలోచించి వుంటే ఆ పని సర్వోత్తమంగా ఉండేది" అని హితవాక్యం చెబుతాడు. అనంతరం విభీషణుడు "అన్నా! పరస్త్రీలను పట్టిచూడడం, అపకీర్తికరం, ఆయుక్షీణం, సంపద్వినాశకరం, పాపానికి మరోరూపం అంతకన్నా మరణమైనది మరొకటి లేదు, సీతా మాతను విడిచిపెట్టు, తృప్తిని, కీర్తిని పెంచే ధర్మాన్ని సేవించు. నా మాటవిని దశరథ పుత్రుడైన శ్రీరామచంద్రునికి సీతను తిరిగి ఇచ్చివేయి. అందరం పుత్రులతో బంధువులతో సుఖంగా జీవించుదాం" అని హితవచనాలు పలికాడు. ఇలాంటి వెన్నో విద్యార్థుల పాఠ్యాంశాలుగా ఉండేవి. ప్రప్రథమ కేంద్ర విద్యామంత్రి మౌలానా అబ్దుల్ కలామ్ ఆజాద్ భారతీయతను విద్యావిధానంలో ప్రవేశపెట్టారు.

మనకు ఏ పనులు బాధకలిగిస్తాయో అలాంటి పనుల్ని ఇతరుల విషయంలో చేయరాదని, మహాభారతం హితం పలికింది. సకలజీవులను హింసించరాదని, అసత్యం పలకరాదనీ, దొంగతనం చేయరాదనీ, హితంకాని దాన్ని పలకరాదని పురాణాల్లో ప్రబోధించడం చూస్తుంటాం.

నిజానికి మనకు అత్యంత సన్నిహితుడు ఆ పరమాత్ముడే. పూలదండలో దారం పూవులకు లోపలే ఉంటుంది. బయట ఉండదు. కానీ భగవతత్త్వం ఈ చరచరా జగత్తులో లోపలా బయటా వ్యాపించి ఉంటుంది. అందుకే సన్నిహితుడైన ఆ భగవంతుడి అనుగ్రహం పొందాలంటే మనం అందరికీ సన్నిహితుడిగా మారాలి. ఈ లోకమంతా మనదేనని భావించాలి. ఎలాంటి తారతమ్యాలు చూపించకుండా సేవలను అందించాలి. అప్పుడే ఆ పరమాత్ముడు మనకు అందుతాడు. కనిపిస్తాడు. మనం చేసే మంచి కార్యాలకు ప్రేరణ, ఉత్సాహం కలిగిస్తాడు. సహాయ సహకారాలు అందిస్తాడు. నిస్వార్థమైన మన కార్యాలకు విజయాలను ప్రసాదిస్తాడు. ●

SRI RAJARAJESWARI JEWELLERY

The Oldest Jewellery Shop in Pondy Bazaar

81, Pondy Bazar, T. Nagar, Chennai - 600 017.

Phones : 28152387, 28154653

*The Purest Treasurer Mortal Times Afford is Spotless Reputation*



# తీర్థంతో దోషాలను నివారించే త్రయంబకేశ్వరుడు

మహారాష్ట్రలోని నాసిక్ జిల్లాలోని త్రయంబకేశ్వరాలయంలోని గర్భాలయంలో ఏకరీతిలో మూడు లింగాలుగా కైలాసనాథుడు కనువిందు చేయడం విశేషం.

ద్వాదశ జ్యోతిర్లింగాల క్షేత్రాలలో ఒకటైన ఈ క్షేత్రం స్థలపురాణం వింత సంఘటనను తెలుపుతుంది. పూర్వం పరమేశ్వరుడు, బ్రహ్మదేవుడు నాలుగు శిరస్సులు కలిగి ఉండేవారు. దీనితో ఉమాదేవికి అయోమయంగా ఉండేది. ఈ విషయమై అమ్మవారు శివుడికి విన్నవించుకోగా ఆయన బ్రహ్మదేవుడికున్న నాలుగు శిరస్సులలో ఒకదానిని చిదిమివేశారు.

శిరస్సును కోల్పోయిన బ్రహ్మదేవుడు పరమశివుడిని ఓ పర్వతంగా మార మంటూ శపించారు. శివుడు వెంటనే బ్రహ్మదేవుని ఆ పర్వతంలో ఓ లింగంగా అవతరించమంటూ శపించారు.

ఇరువురూ శాపం వల్ల పర్వతంగా, లింగంగా ఉండటం చేత ప్రపంచంలో జీవరాశుల ఉత్పత్తి, నాశనం ఆగిపోయి అయోమయ పరిస్థితులు నెలకొన్నాయి.

పార్వతి, సరస్వతి దేవి పరంధాముడి వద్ద వేడుకున్నారు. మహావిష్ణువు తానొక్కడే మూడు కార్యాలను నెరవేర్చలేనని చెప్పి తాను కూడా ఆ పర్వతంలో ఓ లింగంగా కొలువుదీరుతానని, పార్వతి, సరస్వతి, లక్ష్మీదేవి ముగ్గురూ కలిసి ఆదిపరాశక్తి అనుగ్రహం కోసం తపమాచరించమంటూ నుడివి పర్వతంలో లింగరూపంలో ప్రతిష్ఠితుడయ్యారు.

ముగ్గురమ్మలూ ఆదిపరాశక్తి అనుగ్రహం కోసం తపస్సుచేయసాగారు. వారి తపస్సును మెచ్చి ఆదిపరాశక్తి ఎదుట ప్రత్యక్షమయ్యారు.



లింగరూపంలో ఉన్న బ్రహ్మ, విష్ణువు, పరమేశ్వరులను అక్కడున్న తీర్థంలో స్నాన మాచరించి పూర్వపు రూపాలలో వెలుపలికి వచ్చారు. ముమ్మూర్తులూ మూడు జ్యోతులుగా ఆ పర్వతం నుండి బయటపడి వారి ఇష్టదేవేరుల చెంత చేరారు.

ఈ కారణంగానే ఈ క్షేత్రంలో ముమ్మూర్తుల శక్తి, ముగ్గురమ్మల శక్తిగా మూడు లింగాలుగా పరమేశ్వరుడు జ్యోతిర్లింగంగా కొలువయ్యారు.

బ్రహ్మ, విష్ణువు, పరమేశ్వరుడు ముువ్వురూ మూడు లింగాలుగా భక్తులను అనుగ్రహిస్తుండటం వల్ల ఈ క్షేత్రానికి త్రయంబకం అనే పేరొచ్చింది.

ఆదిపరాశక్తి ముమ్మూర్తులను స్నానమాచరింపచేసిన ఈ తీర్థం కోటితీర్థంగా పిలువబడుతోంది. ఈ క్షేత్రం పడమటి తీరాన పరంధాముడు శయన పెరుమాళ్‌గా కొలువుదీరారు. దక్షిణ తీరాన కైలాసనాథుడి ఆలయం ఉంది.

త్రయంబకం ఆలయం, బ్రహ్మగిరి అనే పర్వతం దిగువన ఉంది. ఈ పర్వతశ్రేణులలోనే గోదావరి నదీ ఆవిర్భవించింది. గోదావరి నది పుట్టుక వెనుక ఆసక్తికరమైన చరిత్ర కూడా ఉంది.

బ్రహ్మగిరిలో గౌతమ ముని, సతీమణి అహల్యతో కలిసి పర్ణశాలను నిర్మించుకుని తపస్సు చేసారు. దేశమంతటా కరవుకాటకాలు విలయతాండం చేస్తుండగా బ్రహ్మగిరి ప్రాంతంలో గౌతముడి తపస్సు ప్రభావంతో సకాలంలో వానలు కురిసి సస్యశ్యామలంగా ఉండేది.

దీనితో మునులంతా బ్రహ్మగిరికి తరలివచ్చారు. గౌతమ ముని వారిని సాదరంగా ఆదరించి తపోవనం నిర్మించి ఉచితరీతిన పోషించారు.

కొంతకాలం గడిచింది. కొంతమంది మునులలో ద్వేషభావం పొడసూపింది. గౌతముడి తపోబలాన్ని, సత్కీర్తిని నాశనం చేయాలని ఆ అల్పులైన మునులు భావించారు. పార్వతిదేవి చెలికత్తెలలో ఒకటైన జయ అనే వనదేవతను పశువుగా మారి, గౌతముడి ఆశ్రమంలో మేయమని పురమాయించారు.

పశువు మేస్తుండటాన్ని గమనించి గౌతముడు దర్భపుల్లతో విసిరాడు. వెంటనే పశువు చనిపోయినట్లు నేలపై ఒరిగింది. ఆ సమయంలో కోసమే. వేచివున్న కపట



మునులు గౌతముడికి పశుహత్యా పాపం అంటుకుందని చెబుతూ ఆ పాపపరిహారం కోసం అష్టోత్తర సహస్రలింగాలను ప్రతిష్టించి పూజించాలన్నారు.

గౌతముడు ఆ విధంగానే వెయ్యిన్ని ఎనిమిది లింగాలను ప్రతిష్టించి పరమ శివుని పూజించి తపస్సుచేశారు.

గౌతముడి పూజకు, తపస్సుకు మెచ్చి పరమేశ్వరుడు ప్రత్యక్షమయ్యాడు. గౌతముడికి గోవధ పాపం అంటలేదని, కపటమునులు పన్నాగమే కారణమని స్పష్టం చేశారు.

శివుడి మాటలకు సంతసించిన గౌతముడు దేశమంతా సస్యశ్యామలంగా సౌభాగ్యంగా ఉండేలా చేయమంటూ వేడుకున్నారు.

పరమేశ్వరుడు తన జటాముడి నుండి కొద్ది గంగా తీర్థం గౌతముడికి అందించారు. శివుడిచ్చిన ఆ జలం నదీగా మారి ప్రవహించింది. ఆ నదియే గోదావరి నది అని, గౌతమీనది అని పిలువబడుతోంది.

బ్రహ్మగిరిలో ఉత్పత్తి అవుతున్న గోదావరి తొలుత వృక్షం పేరునుండి ఆవిర్భవించి, పర్వతంలోని చిన్న తొట్టెలో నిండి, తర్వాత మాయమై, కుశావర్తం అనే కొలనులో బయల్పడింది. అటుపిమ్మట దేశమంతటా ప్రవహించి రాష్ట్రాలను సస్యశ్యామలం చేసి జీవనదులలో ఒకటిగా మారింది.

పద్దెనిమిదో శతాబ్దానికి చెందిన త్రయంబకేశ్వర ఆలయం అరటి పువ్వు ఆకారం కలిగి గోపురంతో సుదూర ప్రాంతంలోనే చూపరులను ఆకట్టుకుంటోంది.

ఆలయంలో ప్రవేశించగానే బట్టబయలు ప్రాంతం, నడుమ గోపురం, శిఖరాగ్రాన స్వర్ణకలశంతో, శివుడి శూలాయుధంతో, పతాకంతో భోర్లించిన గరాటులా నిర్మితమైంది. నలువైపులా ప్రహరీగోడలు, లోగిళ్లతో కోటలా... కనపడుతుంది. లోపల అడుగుపెట్టగానే భక్తిపారవశ్యం కలుగుతుంది.

## క్షేత్ర విశేషాలు

| | | |
|---|---|---|
| స్థలం పేరు | : | త్రయంబకం |
| స్వామివారి పేరు | : | త్రయంబకేశ్వరుడు. |
| అమ్మవారి పేరు | : | ఓం త్రయంబకేశ్వరి |
| ఎక్కడ ఉంది | : | మహారాష్ట్రలోని నాసిక్ జిల్లాలో |
| ఎలా వెళ్లాలి | : | అన్ని నగరాల నుండి నాసిక్ లేదా పూనేకు విమానం, రైలు, బస్సులలో వెళ్లవచ్చు. నాసిక్ నుండి, పూనే నుండి ప్రభుత్వ బస్సులు, ప్రైవేటు బస్సులు, మినీ వ్యానులు, కార్లలో త్రయంబకం చేరుకోవచ్చు. |
| ఎక్కడ బస చేయాలి | : | చిన్న ఊరైనా సత్రాలు, ప్రైవేటు లాడ్జీలు ఉన్నాయి. నాసిక్లో నవీన సదుపాయాలు కలిగిన వసతి గృహాలు ఉన్నాయి. రెస్టారెంట్లలో ఉత్తరాది వంటకాలు లభిస్తాయి. |
| దర్శన సమయం | : | ఉదయం 6.00 నుండి మధ్యాహ్నం 12.00 వరకు, సాయంత్రం 4.00 – నుండి రాత్రి 8.00 వరకు. |



గర్భాలయం ఎదురుగా చంద్రాకారపు మండపం కట్టడ కళాచాతుర్యాన్ని చాటేలా ఉంది. మండపం. నలువైపులా లోగిళ్లు. వీటిలో పడమటి దిశగా ఉన్నది గర్భాలయపు ప్రవేశద్వారం. ఆ ద్వారంలో ప్రవేశించి మెట్లపై కిందకు దిగి గర్భాలయంలోకి ప్రవేశించాలి.

మహిళలు, పై వస్త్రం ధరించిన పురుషులకు లోపలకు వెళ్లేందుకు అనుమతి లేదు. భూమిలో పాతబడినట్లున్న పరమేశ్వరుడు, అందులో గులాబీ మొగ్గల్లా మూడు చిన్న లింగాలు కనువిందు చేస్తాయి. పరమేశ్వరుడి శిరస్సుపైభాగం నుండి పుణ్యతీర్థం వెలువడుతూ సదా లింగాలను అభిషేకిస్తుంటుంది.

ఈ మూడు లింగరూపాలకు వెండి ముఖ కవచం ధరింపజేసి పూజిస్తుంటారు.

నందిభగవానుడితో పాటు మహావిష్ణువు, బ్రహ్మ, శ్రీకృష్ణుడు, శ్రీరాముడు, బలరాముడు, గంగాదేవి, వినాయకుడు, గోదావరి మాత ఈ చోట పరివార దేవతలుగా కొలువయ్యారు.

పన్నెండేళ్లకు ఒక పర్యాయం బృహస్పతి సింహరాశిలో ప్రవేశించేటప్పుడు ఈ క్షేత్రంలో కుంభమేళా నిర్వహిస్తారు.

రామలక్ష్మణులు తమ తండ్రిగారైన దశరథుడికి ఈ క్షేత్రంలోనే శ్రాద్ధకర్మలు నిర్వహించారు. కనుకనే ఈ క్షేత్రం పితృదేవతలకు శ్రాద్ధం పెట్టడానికి అనువైన ప్రాంతమైంది.

పలు కీర్తి ప్రతిష్టతలను సంతరించుకున్న త్రయంబకేశ్వరుని దర్శిద్దాం. జన్మ సాఫల్యం పొందుదాం! ●

## విడిపోతామని కలహాల కాపురంతో కలిసిననాడే అనుకున్నాను

మనమిలా విడిపోతామని
ఎవడూ అనుకోలేదు! కానీ
నేను అనుకున్నాను - దేశాన్ని
విడగొట్టిన పాపం ఊరికే పోతుందా?
తెలుగువాడెపుడూ కలిసి ఉండడు
ఉమ్మడి కుటుంబాల విచ్ఛిన్నమైన
అలనాడే గ్రహించాను! భాషపై
వాడికెపుడూ అభిమానం లేదు!
కాంగ్రెసుకు 125 ఏళ్లంటే
నవ్విపోదురు! ఇందిరాగాంధీ
నాడే - అసలు కాంగ్రెసు- కుద్వాసన చెప్పారు!
ఇప్పుడున్నది కాంగ్రెసు 'ఐ'
'ఉయ్' కాదని తెలుసుకోరా!
త్లవట దద్దమ్మా. ఆత్మగౌరవం లేనివాడా-
యని అనాలంటే సభ్యత అడ్డుపడుతుంది!

\- గోటేటి




## శ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశనందగిరి స్వాముల వారు

# భక్తితోగూడిన దానికే విలువ

పూర్వకాలమున ఒకానొక గ్రామమున ఒక భక్తుడు నివసించుచుండెను. అతడు "ఓమ్ నమో నారాయణాయ" అను అష్టాక్షరీ మహా మంత్రమును నిరంతరము జపించుచుండెడివాడు. తన పూజా మందిరములో శ్రీమన్నారాయణుని విగ్రహము నెదుట గూర్చొని భక్తి పూర్వకముగ ప్రతిదినము పై మంత్రమును పునశ్చరణ చేయుచుండెను. ప్రాపంచిక పదార్థములపై అతనికి ఏమాత్రము ఆసక్తి లేకుండెను. వైరాగ్యసంపన్నుడై భోగవస్తుజాలమును లెస్సగా పరిత్యజించి, దృష్టిని బహిర్ముఖముగ ప్రసరింపజేయక, నారాయణుడే తనకు దిక్కని నమ్మినవాడై మనోవాక్కాయములచే ఆయననే హృదయమున సంస్మరించుచు నుండెను.

ఇట్లుండ, ఒకనాడతడు ప్రతిదిన పద్ధతి ప్రకారము ఉదయముననే స్నానాదులను నిర్వర్తించుకొని శుచిర్భూతుడై తన పూజా మందిరమున శ్రీమన్నారాయణుని దివ్యమంగళ విగ్రహము నెదుట గూర్చుండి దృష్టిని భ్రూమధ్యమున నిలిపి తదేక దృష్టితో నారాయణుని భావించుచు అష్టాక్షరీ మంత్రమును జపించుచుండ, ఆతని భక్తికి అపరిమిత శ్రద్ధకు మెచ్చి వైకుంఠనాథుడు శంఖ చక్ర గదాధారియై ఆకస్మికముగ ఆ పూజా మందిరమున ప్రత్యక్షమయ్యెను. భగవానుని ప్రత్యక్షముగ దర్శింపగల్గు మహద్భాగ్యము ఉదయించుటచే ఇక ఆ భక్తుని ఆనందమునకు మేరయే లేకుండెను. తదేక దృష్టితో ఆనంద పరవశత్వములో, ఉత్కంఠితహృదయముతో అతడు భగవానుని ప్రత్యక్ష రూపము వీక్షించుచుండెను. ఏమిచేయుటకును తోచకుండెను. అది భగవానుని ఆకస్మిక గమనము (%ఐతిజీ– చీజీరిరీలి జరిరీరిశి%) అగుటవలనను, దేవుని సత్కరించుటకు ముందుగా ఏవిధమైన ఏర్పాట్లు చేసియుంచు కొనకపోవుటవలనను, కడుబీదవాడగుటచేతను భగవంతునికి నివేదించుటకు తగిన వస్తుసంభారములు లేక యుండుటవలనను, ఇంటికి వచ్చిన ఆ లోకోత్తర అతిథిని ఎట్లు సత్కరించవలెనో తోచక తికమక పడుచు తొట్రుపాటు పడుచునుండెను.

భగవద్దివ్య స్వస్వరూపసందర్శన జనిత మహదానంద పరిపూరిత హృదయసహితుడగు ఆ భక్తుడు తత్పమయమున తన పూజా మందిర మంతయు తేరిపారచూడ ఒకమూల ఒక అరటిపండు అతనికి దృగ్గోచర మయ్యెను. తోడనే పరుగెత్తికొని వెళ్ళి దానిని పట్టుకొనివచ్చి, ఆ స్వల్పప్రసాదము నైనను భగవంతునకు నివేదింప దలంచి, ఆనంద పారవశ్యముచే ఒడలు గగుర్పాటు నొందుచుండ మనస్సు నారాయణుని దివ్యపాద పద్మములపై సంలగ్న మొందియుండ, తొందరలో ఆ అరటి పండును ఒలిచి లోని గుజ్జును పారవైచి తొక్కను దేవునకు పెట్టెను. భక్తిరసముచే పరిప్లావితమైన ఆ తొక్కను భగవాను డపుడు ఆనంద ముతో స్వీకరించి, భుజించి అంతర్ధాన మొందెను.

తదుపరి కొద్దిసెపటికి ఆ భక్తుడు తన పొరపాటును గుర్తెరిగి పశ్చాత్తాపతప్తుడై, భగవానునకు గొప్ప అపచారము చేసితినని తలంచి అత్యంతఖిన్నుడై, ఏమి చేయుటకును తోచక హృదయము వేదనలో క్రుంకుచుండ గొప్ప పరితాపమును బొందుచుండెను. "అయ్యో ! నేనేల ఇట్లు చేసితిని? సామాన్యమానవుని కైనను అరటితొక్కను ఎవ్వరును ఇవ్వరే? ఇక చతుర్దశ భువనాధిపతి యగు శ్రీమన్నారాయణునికి నేనేల ఇట్టి తుచ్ఛవస్తువు నొసంగితి?" అని పలువిధముల తలపోయుచు తుదకు గుండె నిబ్బరము కలుగజేసికొని ఈ క్రింది దృఢ నిశ్చయమునకు వచ్చెను. ఇక విచారించిన ప్రయోజనము లేదు. మరల భగవానుని త్వరలోనే నేను ప్రత్యక్ష మొనర్చుకొనెదను. అతడు భక్తవత్సలుడు కావున పరిపూర్ణ భక్తితో అకుంఠిత దీక్షతో అష్టాక్షరీ మహామంత్రమును జపించుచు, ఆతనిని ధ్యానించినచో తిరిగి యతడు ప్రత్యక్షము కాగలడు.

అయితే ఈసారి పూర్వము చేసిన పొరపాటు మరల జరుగ కుండు నిమిత్తము ముందుగనే యతడు చాల జాగ్రత్తపడెను. ఒకగెల అరటిపండ్లు తెప్పించి దేవుని విగ్రహము ముందు పెట్టి "ఒక వేళ భగవంతుడు అకస్మాత్తుగ ఇచటికి వచ్చినప్పటికిని ఈసారి పండు ఒలిచి గుజ్జు మాత్రమే దేవునకు పెట్టి తొక్క పారవేసెదను"అని కృతనిశ్చయుడై ఆ గెలలోని ఒక్కొక్కపండు త్రుంచి, తొక్కుతీసి గుజ్జును గట్టిగా చేతితో పట్టుకొని దేవున కిచ్చునట్టుగా అభ్యాసము (Reharsal) చేయదొడగెను. ఈ ప్రకారము గెలలోని అన్ని పండ్లను ఒక్కొక్కటిగ త్రుంచి గుజ్జును గట్టిగా పట్టుకొను అభ్యాసము చేసి ఆ పనియందు చక్కని ప్రావీణ్యమును బడసెను. "ఇక దేవుడు ఎపుడువచ్చినను పరవాలేదు. ఈసారి గుజ్జుమాత్రమే నివేదింపబడ గలదు గాని తొక్కుకాదు" అని బాగుగ నిశ్చయించుకొని మరల తన పూజా గృహమున ప్రతిదినము పూజచేయదొడంగెను.


ఇట్లుండ ఒకనాడు ఆతని భక్తికి మెచ్చి శ్రీమన్నారాయణుడు మరల ప్రత్యక్ష మయ్యెను. పూర్వపు అభ్యాసము దృఢపడి యుండుటచే వెంటనే అతడు ప్రక్కనున్న అరటిపండును పట్టుకొని జాగ్రత్తగ ఒలిచి గుజ్జును గట్టిగ పట్టుకొని తొక్కను పారవైచి, ఆగుజ్జును భగవానుని నోటిలో పెట్టెను" కాని భగవానుడు దానిని భుజింపక ఊసివేసెను. అపుడాభక్తుడు దుఃఖాక్రాంతుడై విలపించుచు, భగవానుని పాదపద్మము లపైపడి, ఏల తాము భుజింపలేదని ప్రార్థింప ఆతడిట్లు నుడివెన్ను ఓయీ! పూర్వము నీవు నాకు తొక్కను నివేదించినపుడు నీ మనస్సు నా పాదపద్మములపై సంలగ్నమై యుండుటవలన అసారమైన ఆ వస్తువు భక్తిరసముచే తడుపబడి అమృతతుల్యమై యుండుటచే నేను దానిని భుజించితిని, ఈ సారి వచ్చినపుడు నీవు గుజ్జును ఇచ్చి నప్పటికిని నీ మనస్సంతయు అరటిపండు పైననే లగ్నమై యుండుట వలన, వస్తువు మంచిదైనను భక్తిరసహీనమై యుండుటవలన అది విషతుల్యముగ మారినది. అందుచే నే నద్దానిని భుజింపక పారవేసితిని'. అని చెప్పి యంతర్ధాన మొందెను.

అప్పటినుండియు ఆ భక్తుడు తెలివితెచ్చుకొని భగవన్నివేదనాది కార్యములందు వస్తువుకంటె భక్తికే ప్రాధాన్యత నొసంగుచు వచ్చి క్రమముగ భగవదనుగ్రహమునకు పాత్రుడు కాగల్గెను. దేవుడు తనకు "ఏది ఒసంగిరి" అని చూడడు "ఎట్లు ఒసంగిరి" అని చూచును. కాబట్టి జనులు పూజాప్రార్థనాదులందు భక్తికి ప్రాధాన్యాత నిచ్చి దానిని బాగుగ అభివృద్ధి నొందించుకొనుచుండవలెను.

**అణ్వప్యుపాహృతం భక్త్యా ప్రేమ్ణాభూర్యేన మే భవేత్ ।**
**భూర్యప్యభక్తోపహృతం న మే తోషాయ కల్పతే ॥**

కొంచెమైనను భక్తితో, ప్రేమతో ఒసంగబడినది కొండంత కాగలదు. కొండంత ఇచ్చినను భక్తితో కూడియుండనిచో అది నాకు సంతుష్టిని కలుగచేయజాలదు. అను ఈ భగవద్వాక్యమును సర్వులును స్మృతిపథమున నుంచుకొని సర్వేశ్వరునియెడల అనన్య భక్తిభావమును పెంపొందించు కొనుదురుగాక!

**నీతి:– భక్తితో గూడినపుడే వస్తువునకు విలువ ఏర్పడును.**




## మా కొద్దీ తెల్లదొరతనమూ - అని పూర్వ తెలుగు కవి అంటే- తెల్లారిదాకా తొంగనీయరా!

# తెల్లారితే ఏ పన్నులు ముంచుకొత్తాయో!

## -తమాషాకు మాత్రమే చదువుకోండి సుమా-

### కాఫీయో, 'టీ'యో ముందెట్టుకుని సదవండి. కాకుంటే ఏదీ లేదూ! సూపుపోద్ది!!

ఇంట్లో అడుగుపెట్టారో లేదో నన్ను చూడగానే... వల వల చిన్నపిల్లాడిలా ఏడ్చాడు మా ఆయాన. ఏమో అనుకుని ఊరుకోండి. ఆయనను సముదాయించాలని చూశా. కన్నీళ్ళ పర్యంతమవుతూ వెళ్ళిన నా మనసు మనసులో లేదు. ఏం జరుగుతుందో తెలియట్లేదు. నువ్వైనా కనుక్కొని చెప్పు. అంటూ ఆదేశించినట్లే అన్నారు. దీంతో అమెరికాలో ఎక్కడ ఏ హాస్పటిల్‌లో చేర్పించాలంటూ అడిగి చిరునామా తీసుకుని బైటకొచ్చా.. రాత్రి నాతో సన్నిహితంగా ఉంటూ ఎప్పటికప్పుడు ఫోన్లో మాట్లాడే ఎన్నారై మిత్రుడొకరికి ఫోన్ చేసి వివరాలు చెప్పి కుమార్ ఆరోగ్య పరిస్థితిపై వాకబు చేసి క్షేమసమాచారం అందించమన్నా. తనకు కాస్త దూరమే అయినా శని, ఆదివారాలు సెలవు కావటంతో అక్కడికి వెళ్లి ఆసుపత్రి వెతికిపట్టుకుని కుమార్ ఉన్న రూముకి వెళ్లాడు.

తానెవరో ఎందుకొచ్చానో కాస్త పరిచయం చేసుకుని, కుశల ప్రశ్నలేస్తూనే ఇంతకీ ఎందుకు మీకు గుండె నొప్పి అంత ఎక్కువగా వచ్చింది అనీ అడిగా ఇండియాలో బాగు చేయలేనంత? అనీ ఇదంతా ఇండియాలోని పన్నుపోట్లతో వచ్చిన గుండెపోటు సార్ అంటూ ఆవేదన వ్యక్తం చేసాడు. పన్నుపోటా అదేంటి? అసలు పోట్లేంటో తెలుసుకోవాలన్న ఉత్సాహం పెరగడంతో ప్రశ్నల వర్షం కురిపించాడాయన... అందుకు తాపీగా తన పద్ద పన్నుపోట్లు వివరాలు చెప్పాడు కుమార్. వారి మధ్య సాగిన సంభాషణని రికార్డు చేసి అక్కడి నుండే వినిపించటం దేనికని మీతో చదివించే ప్రయత్నం; యధాతథంగా ఇస్తున్నా..

1. ఎన్నారై : ఇండియాలో మీరేం చేస్తున్నారు?
   కుమార్ : వ్యాపారం
   కట్టేటాక్స్ : **ప్రొఫెషనల్ టాక్స్**
2. ఎన్నారై : ఇంతకీ ఏ వ్యాపారం?
   కుమార్ : ఏదో ఇంటి ఫర్నీచర్, అలంకరణ సామగ్రి అమ్మకం.
   కట్టే టాక్స్ : **సేల్ టాక్స్**
3. ఎన్నారై : వీటిని ఎక్కడ నుండి తెప్పిస్తారు?
   కుమార్ : కొన్ని ఇతర రాష్ట్రాల నుండి మరి కొన్ని విదేశాల నుండీ!
   కట్టేటాక్స్ : **సెంట్రల్ సేల్స్‌టాక్స్ కస్టమ్స్ డ్యూటి.**
4. ఎన్నారై : ఇంత బాధపడటం ఎందుకు సొంతంగా మనుషుల్ని పెట్టుకుని చేయించుకోవచ్చుగా...
   కుమార్ : ఆ ఆ పనీ చేస్తున్నాను.
   పెద్ద వర్క్‌షాపేం ఖర్మ ఏకంగా కంపెనీయే పెట్టవచ్చు అన్నారు.
   కట్టేటాక్స్ : **ఎక్సైజ్ డ్యూటీ**
5. ఎన్నారై : పనివారు బాగున్నారా?
   కుమార్ : లేకేం చాలామందే. అందరికీ టంచనుగా ఒకటో తేదీకే జీతాలిస్తా..
   కట్టే టాక్స్ : **స్టాఫ్ ప్రొఫెషన్ టాక్స్**
6. ఎన్నారై : మరి వ్యాపారం బాగా టర్నోవర్ చేస్తోందన్న మాట
   కుమార్ : చేస్తోంది..
   కట్టే టాక్స్ : **టర్నోవర్ టాక్స్**
7. ఎన్నారై : మరి లాభాలు కూడా బాగా వస్తుండాలే..
   కుమార్ : ఫర్వాలేదు..
   కట్టే టాక్స్ : **ఇన్‌కం టాక్స్**
8. ఎన్నారై : మీ కంపెనీలో షేర్లు పెట్టిన వారికి లాభాలిస్తున్నారా?
   కుమార్ : ఎందుకివ్వట్లేదూ... డివిడెండ్ల రూపంలో అందిస్తున్నా.
   కట్టే టాక్స్ : **డివిడెండ్ డిస్ట్రిబ్యూషన్ టాక్స్**
9. ఎన్నారై : మీ కంపెనీ కోసం బ్యాంకు లావాదేవీలు చేస్తుంటారా?
   కుమార్ : అవి నిత్యకృత్యం!
   కట్టే టాక్స్ : **క్యాష్ హేండలింగ్ టాక్స్**
10. ఎన్నారై : మీ స్పాన్సర్ షిప్‌తో జరిగే ఫంక్షన్లు హోటల్స్‌లో నిర్వహిస్తుంటారా?
    కుమార్ : డిన్నర్లు, పార్టీలు చేయక తప్పవు కదా?
    కట్టేటాక్స్ : **ఫుడ్ అండ్ ఎంటర్‌టైన్‌మెంట్ టాక్స్**
11. ఎన్నారై : వ్యాపారం అభివృద్ధి కోసం ఇతర రాష్ట్రాలు వెళ్తుంటారా?
    కుమార్ : ఇతర రాష్ట్రాలకే కాదు ఇతర దేశాలకు కూడా వెళ్తుంటా..
    కట్టేటాక్స్ : **ఫ్రింజ్ బెనిఫిట్ టాక్స్..**
12. ఎన్నారై : కస్టమర్లకు సేవలందించే నిమిత్తం సర్వీస్ కేంద్రాలు ఏర్పాటు చేసారా?
    కుమార్ : ఇతరుల నుండి మేం సర్వీస్ పొందుతున్నట్టే మా కస్టమర్లకూ సర్వీస్ కేంద్రాలు ఉన్నాయి.
    కట్టేటాక్స్ : **సర్వీస్ టాక్స్**
13. ఎన్నారై : వివిధ సందర్భాలలో కుటుంబసభ్యులకో ఇతరులకో నగదు బహుమతులిస్తుంటారా?
    కుమార్ : తప్పదు కదా
    కట్టేటాక్స్ : **గిఫ్ట్‌టాక్స్**
14. ఎన్నారై : మరి ఈ వ్యాపారంలో బాగానే సంపాదించి ఉంటారుగా?
    కుమార్ : ఉన్నంతలో కొంత బెటరే..
    కట్టేటాక్స్ : **సంపద పన్ను**
15. ఎన్నారై : మరి ఇళ్ళు స్థలాలు కొనుక్కుని ఉంటారే?
    కుమార్ : సొంత ఇంటి కోసం, ఫ్యాక్టరీ కోసం తపన తప్పుకాదుగా.
    కట్టే టాక్స్ : **స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజులు**
16. ఎన్నారై : మీ ప్రయాణం ఎక్కువగా దేన్లో?
    కుమార్ : ఎక్కువగా కార్లోనే.. అప్పుడప్పుడు సరదాగా బస్సుల్లోనూ వెళ్తా...
    కట్టేటాక్స్ : **రోడ్ టాక్స్...సర్‌ఛార్జీలు**
17. ఎన్నారై : మరి పని వత్తిడి తగ్గించుకునేందుకు సినిమాలు, షికార్లుకి వెళ్తారా?
    కుమార్ : వెళ్లక తప్పదు కదా? నా కోసం కాకపోయినా ఇంట్లో వాళ్ల కోసం అప్పుడప్పుడూ.
    కట్టేటాక్స్ : **ఎంటర్‌టైన్‌మెంట్ టాక్స్**
18. ఎన్నారై : ఇవి కాక ఇంకా ఎలాంటి పన్నుల చెల్లిస్తున్నారు..
    కుమార్ : బోలెడున్నాయి...
    కట్టే టాక్స్ : నీళ్ళు రాకున్నా **వాటర్ టాక్స్, ఎడిషనల్ ఎడ్యుకేషన్ టాక్స్** ఇలా బోలెడు.
19. ఎన్నారై : ఇన్ని పన్నులు కడుతూ ఎందుకు బాధ పడుతున్నారు?
    కుమార్ : పొరపాటునో గ్రహపాటునో కాస్త లేట్ అయితే పన్ను మీద పన్ను పడుతోంది.
    కట్టేటాక్స్ : ఆలస్యానికి **అపరాధ రుసుములు, వడ్డీలు.**
20. ఎన్నారై : అది సరే ఇంకా పన్నేంటి మీపై..
    కుమార్ : పన్నులను మించిన పన్నులు
    గోడకు చెవులుంటాయ్ సుమండీ.

(2013 జూలై 10 **ఆదివారం** సంచికలో
సత్యగోపాల్ గారి వ్యాస సారాంశం)








# తంజావూరు సాహితీ మహలు!

'శ్రీవాణీ గిరిజాశ్చిరాయ..'తో మొదలు పెట్టి నన్నయ కవి తెలుగు పద్యాన్ని, హృద్యంగా వినిపించాడు. పక్కనే తిక్కనసోమయాజి నిర్వచనోత్తర రామాయణాన్ని భక్తిగా రాస్తుంటాడు. అల్లసాని పెద్దన 'మనుచరిత్ర' పెద్దగా చదువుతుంటే, రాయలవారు అరమోడ్పు కళ్ళతో ఆలకిస్తుంటారు. అంతలోనే తెనాలి రామకృష్ణుడు 'తాతగారి' రసికత మీద ఏవో చెణుకులు విసురుతాడు. అక్కడున్న వేలాది తాళపత్ర గ్రంథాలూ ప్రాణం పోసుకోవడానికే కారణం. తంజావూరు సరస్వతీ మహలు తెలుగు సాహితీ దర్బారు అనవలసిందే!

**వాయువెల్లవారికి నెట్లు స్వాధీనమైయున్నదో**
**జ్ఞానమునునట్లు స్వాధీనము కావలయును**
**ఉదయమెల్లవారికి నెట్లు సేవ్యమైయున్నదో**
**జ్ఞానమునునట్లు సేవ్యమై యుండవలయును**

ఇది చిలకమర్తివారి గ్రంథాలయ సూక్తి.

వివిధ కాలాల్లోని పుస్తకాలు అక్షర జిజ్ఞాసువుల ఆలోచనలకు అక్షరరూపం. తెలుగువారికి అపారమైన సంపదానిలయం. నన్నయ నుంచి ఎంతో మంది కవులు, రచయితలు, పరిశోధకులు, ఆధ్యాత్మిక వేత్తలు అపారమైన అక్షర నిధిని, మనకం దించారు. తరాల నిర్లిప్తతో తెలిసీ చేస్తున్న తప్పిదం. కారణం ఏమైతేనేం, ఆ అమూల్య సంపద చాలా వరకు కాలగర్భంలో కలిసిపోయింది. తాటాకు గ్రంథాలు చెదలుపట్టి పోయాయి. తామ్రపత్రాలు అజ్ఞానుల చేతుల్లోపడి కరిగిపోయాయి. తమిళుడు తంజావూరు విజ్ఞానబాంధాగారం భద్రం దాచుంచకపోతే ఎంత నష్టం వాటిల్లేదో?

ఆ చదువుల తల్లి చలువపందిరి పేరు తంజావూరు సరస్వతీ మహలు. తెలుగు, సంస్కృత, తమిళ సాహిత్యాలకు సంబంధించి ఎన్నో అరుదైన తాళపత్రాలూ రాత పత్రాలూ సురక్షితంగా ఉన్నాయ్. తమిళులు తంజావూరును 'తంజై' అని పిలుస్తారు. తంజై అంటే ఇతర ప్రాంతాల నుంచి వచ్చినవారికి ఆశ్రయమిచ్చే స్థలం. విడి దిల్లువంటిది. ఇతర భాషల సాహిత్యానికి నీడనివ్వడం వల్ల ఆ పేరూ సార్థకమైంది.

'తనువుప్పొంగ సరస్వతీ మహలు సందర్శించి తంజాపురీ మనుజాధీశుల యోల గంబును పరామర్శించి పొమ్ము అంటాడు 'గబ్బిలం'లో జాషువా. సరస్వతీ మహలును సందర్శిస్తే తనువు ఉప్పొంగిపోతుందట. అదీ ఆంధ్ర భాషాభిమానం. తంజావూరును పాలించిన మహారాష్ట్ర పాలకులు మన తాళపత్ర గ్రంథాల్ని అపురూపంగా భద్రపరి చారు. తెలుగు మాతృభాష కాకున్నా మాతృభావనతో గౌరవించారు. ఆ పాలకులే కనుక పట్టించుకోకపోతే, ఎన్నో విలువైన రచనలు మట్టికొట్టుకుపోయేవి. మనదీ అని సగర్వంగా చెప్పుకోదగ్గ సాహిత్యం చాలా వరకు మరుగైపోయింది.

సరస్వతీ మహలు ఎప్పుడు పుట్టిందో ఎవరూ కచ్చితంగా చెప్పలేకపోతున్నారు. క్రీ.శ. 1122 నాటికే ఉందని మాత్రం స్పష్టమవుతోంది. గ్రంథాలయ భవనాన్ని మాత్రం పదకొండో శతాబ్దంలో నిర్మించారని 'సోమలె' అనే చరిత్రకారుడు అభి ప్రాయపడ్డాడు. మరో చరిత్రకారుడు పద్నాలుగో శతాబ్దంలో నిర్మించా రనడానికి ఆధారాలున్నాయి అన్నాడు. ఎన్ని వాదనలున్నా 'సరస్వతీ మహలుకు వెయ్యేళ్లకు మించిన చరిత్ర ఉందన్నది సత్యం.

తంజావూరు సాహితీ వైభవం చోళుల పాలనతో మొదలైంది. ఆ పాలకులు ఆలయాల పక్కనే గ్రంథాలయాలు నిర్మించి, పుస్తకాలను దేవుడితో సరిసమానంగా గౌరవించారు. అందులోనూ మొదటి కులోత్తుంగుని కాలంలో తంజావూరు విద్యలకు నిలయమైంది. కులోత్తుంగ చోళుడు తెలుగు, తమిళ, సంస్కృత భాషల్లో అపారమైన ప్రతిభావ్యుత్పత్తులున్నవాడు. ఇతని కాలంలోనే వివిధ భాషల తాళపత్ర గ్రంథాలను సరస్వతీ మహలులో భద్రపరిచే కార్యక్రమం మొదలుపెట్టారు. నన్నెచోడుని కుమార సంభవాన్ని కూడా అప్పుడే సర్వసతీ మహలుకు తరలించారు. మానవల్లి రామకృష్ణ కవిగారనే మహానుభావుడు పుస్తకాల అరల్లో ఎక్కడో దుమ్ముపట్టిపోయిన ఆ తాళపత్రాల్ని గుర్తించి, పరిష్కరించి, ప్రచురించి పుణ్యంకట్టుకున్నాడు. తెలుగుజాతి యావత్తూ ఆయనకు చేతులెత్తి మొక్కి కృతజ్ఞతలు తెలుపుకోవాలి. ఆ ప్రయత్నమే జరగకపోతే, మనకు కుమార సంభవం అసంభవమయ్యేది.

చాళుక్య రాజు రెండో జయసింహునికి 'జయ' సేనాపతి అనే పేరుంది. ఆయన రాసిన 'నృత్య రత్నావళి' అనే నాట్యశాస్త్ర గ్రంథం ఇక్కడే భద్రంగా ఉంది. ఇందులో నాట్యానికి సంబంధించిన 108 కరణాల గురించి సమగ్రంగా వివరించారు. సదాశివ బండారత్తాళ్ రచనల ప్రకారం...తిక్కన సోమయాజి నిర్వచనోత్తర రామాయణాన్ని మూడో చోళరాజేంద్రుని హయాంలో రాశాడు. ఆ తాళపత్రప్రతులు కూడా సరస్వతీ మహలులో ఉన్నాయి. ఒకటా, రెండా, 1535 నాటికే అక్కడ ఎన్నో తెలుగు గ్రంథాలున్నాయి. 'కాళహస్తీశ్వర మాహత్మ్యం', 'ఆంధ్ర మహాభారతం' 'ఆంధ్ర మహా భాగవతం', 'హయలక్షణ విలాసం' 'కిరీటాభిరాం గ్రంథాల జాబితా తెలుగువారి చాంతాడంత ఉన్నది.

నాయకరాజుల కాలంలోనూ తెలుగు సాహిత్యానికి అపారమైన గౌరవాభి మానాలుండడంచే వేలాది తాళపత్రాలు సరస్వతీ మహలుకు తరలివచ్చాయి. ఆ పాలకులు రాయసకాండ్రను నియమించి, శిథిలమైపోతున్న తాళపత్రాలకు నకళ్ళు తీయించారు. ఆ సేవాభాగ్యం సేవప్ప నాయకుడిదే! ఆ తర్వాత వచ్చిన రఘునాథ నాయకుడు అభినవ ఆంధ్రభోజుడనిపించుకున్నాడు. చేమకూర వేంకటకవి మాన్యాలిచ్చినదీ మహానుభావుడీయనే. రామభద్రాంబకు నీడనిచ్చిన కవిపోషకుడూ ఈయనే సాక్షాత్తూ ప్రభువులే కవులైతే కవనానికి రాజవైభోగమే. రఘునాథ నాయకుడు మంచి కవి. ఆయన రచనలు ఇప్పటికీ సరస్వతీ మహలు అద్దాల అరల్లో భద్రంగా ఉన్నాయి. ●

# నూరు సంవత్సరాలు పూర్తి చేసుకున్న ఎల్లమరాజు గోపాలకృష్ణమూర్తి!

## -75 సంవత్సరాల న్యాయవాది అనుభవం ఉన్నది-

మీ జీవిత రహస్యమేఁవిటి– ఈ వయసులో కూడా ఇన్ని మైళ్ళు కాలినడకనే వస్తున్నారూ– అని 14 మైళ్లు (కిలోమీటర్లు కావు) భీమవరం నుంచీ గణపవరం నుంచీ నడిచి వచ్చిన మా నాన్న గోటేటి విస్సం రాజుగారినో (మా నాన్నగారు డాక్టర్ లెండి) ఓసాటి వైద్యుడడిగారు. భీమవరం నుంచి బయల్దేరుటకు ఓ గంట ముందే వరిధనం (పాలకొల్లు ప్రక్క ఊరు) 15 మైళ్ళు నడిచి, భీమవరంలో ఓ మిత్రుని ఇంటి వద్ద ఆగారు. అప్పు డాయన చెప్పినమాట– సూర్యోదయత్పూర్వమే నూతివద్ద స్నానము, 9 గంటలకు గాయత్రీ జపం, 10కి భోజనం చేసి, తిరిగి రాత్రి 7 గం॥లకు భోజనం అన్నారు.



ఈ స్వకపోతానికి కారణం– ఈ మధ్య విన్న ఎల్లమరాజు గోపాలకృష్ణమూర్తిగారి నూరవ జన్మ దినం, న్యాయవాదిగా ఆయన పూర్తి చేసుకున్న 75 సం॥ల న్యాయవాది జీవితం.

సర్వసాధారణంగా న్యాయవాది అబద్ధం ఆడ కుండా జీవితం సాగించలేడు. కానీ ఆనాడు న్యాయవాదులైన టంగుటూరి ప్రకాశం పంతులు, పాకాల వెంకట రాజమన్నార్, కోకా వెంకట సుబ్బా రావుగారలు అబద్ధాలు ఆడకుండా న్యాయవాద వృత్తికి విలువతెచ్చారు. ప్రకాశం గారు కేసు వాదిస్తు న్నారంటే – తెల్లదొరలైన న్యాయమూర్తు (జడ్జీ)లు కళ్ళు తెరచి, చెవులు రిక్కించి వాదనలను వినేవారు. సమయపాలనం చేసేవారు.

అలాటి పవిత్ర న్యాయవాద వృత్తిని అకళకంగా నిర్వర్తించిన ఎల్లమరాజు గోపాలకృష్ణమూర్తి అంటే నాకెంతో గౌరవం కలిగింది. వారిది న్యాయవాదుల వంశం. 20 మంది పూర్వులు న్యాయవాదులుగా పనిచేసారు. వారి తండ్రిగారు న్యాయవాదిగా మంచిపేరు సంపాదించారు. తండ్రిబాటలోనే గోపాల కృష్ణమూర్తి కూడా న్యాయవాది వృత్తి నెన్నుకోవడానికి కారణమైంది.

మద్రాసు క్రిస్టియన్ కాలేజీలో బి.ఎస్.సి. పట్టా అందుకుని మద్రాసు 'లా' కాలేజీలో బి.యల్. పట్టానందుకున్నారు. 1936 సం॥ములోనే మద్రాసులో న్యాయవాది వృత్తిని ప్రారంభించారు. ఆంధ్రరాష్ట్రం సిద్ధించి, గుంటూరులో హైకోర్టు ప్రారంభించిన తరువాత గుంటూరులో న్యాయవాదిగా ప్రసిద్ధిగాంచారు. ఆంధ్రప్రదేశ్ అవతరణంతో హైదరాబాద్‌లో హైకోర్టు స్థిరమైంది., మరలా గోపాలకృష్ణమూర్తిగారు 'కాము'గా 'మకాము' హైదరాబాద్‌కు మార్చారు. అదే ఆయనకు స్థిరనివాస మయింది. బార్ కౌన్సిలు సభ్యులైన తరువాత ఆయన కీర్తి ప్రతిష్టలు విస్తరించాయి. పరిచయాలు పెరిగాయ్. నేస్తాలు పెరిగాయ్. చాలామంది ఆయన్ను 'వకీలు'గా ఎన్నుకునేవారు. సత్యనిబద్ధమైన మార్గంలో, తమ పూర్వులు నడిచిన బాటలో నడవడం ఆయనకు మెరుగైన జీవితమైంది.

డబ్బుమీద ఆశతో ఏ కేసు పడితే ఆ కేసును చేబట్టరనే పేరు వచ్చింది. నైతికంగా ఆ కేసు ధర్మబద్ధమైన దనుకున్నప్పుడే వాదించేవారు. ఆయన వాదించిన కేసులకన్నీ విజయములే. విడాకుల వంటి కేసును దరి చేరనిచ్చేవారు కాదు. కేసులు పొడిగింపచేయడం పట్ల ఆయన విముఖత చూపేవారు. కేసుల్ను వాదించేవారి వద్దకానీ, తీసుకువచ్చే క్లయింట్స్ వద్దగానీ ఓ కప్పు కాఫీని కూడా త్రాగేవారు కారని విని– ఆయన చిత్తశుద్ధికి అంజలి ఘటిస్తున్నాను. ఎందరో న్యాయమూర్తులు ఆయన ముందే పదవీ విరమణం చేసారు.

ఆయన చెప్పిన కొన్ని మాటలు ఎంతో ఆశ్చర్యకరంగా ఉంటాయ్. ఆ రోజుల్లో హిమయత్ నగర్‌లో ఆయన హైకోర్టుకు రిక్షాలోనే వెళ్ళేవారట. ఎనిమిది అణాలు (అర్ధరూపాయి) యిస్తే వాడెంతో సంతోషమందేవాడట. బషీర్‌బాగ్ నుంచి మూడే మూడు రూపాయలకు టాక్సీలో వెళ్ళేవారట. 1958 సం॥ములో 75 రూపాయలు చెల్లించిన ఇంటిఫోనే ఇప్పటికీ వాడుకలో ఉన్నదంటారు.

కోర్టులు పెరిగినందున సమస్యలు త్వరగా తీరిపోవు. న్యాయవ్యవస్థ దిగజారిం దనడం నిజం కాదు. అవినీతి ప్రతీ రంగంములోనూ ఉన్నది. అది న్యాయశాఖకు కొంత బదిలీ చెంది ఉండవచ్చు. కానీ పూర్తి న్యాయవ్యవస్థ చెడిపోలేదంటారు.

చాలామంది చోద్యంగా నన్నుడుగుతుంటారు. నూరు సంవత్సరాలు వచ్చినా నిండు ఆరోగ్యంగా ఉన్నారు. రహస్యమేఁవిటి అని? కొత్త రహస్యమేఁవీ లేదు. ఉదయం ఐదింటికే లేచి కాలకృత్యాలు తీర్చుకుని కాలినడకతో దిన కృత్యం ప్రారంభమవుతుంది. శుభ్రంగా రెండు పూటలా, ఇంట్లో మృష్టాన్నభోజనం చేస్తాను. నెయ్యిలేనిదే నోట్లోకి ముద్ద దిగదు. శాఖాహారిని. నూనెలోని రొట్లు, మొలకలెత్తిన పప్పులూ తినాలనే నియమం లేదు. స్వీట్లు బాగా తింటాను. మధు మేహం (షుగర్) రక్తపోటు (బి.పి.) కానీ లేవు. సాధారణంగా బయట భోజనం చేయను. ఎప్పుడో కానీ ఆ అవసరం ఉండదు. కోర్టు యింటిల తరువాతనే – ఏమైనా? రాత్రి 10 గం॥లయ్యేసరికి నిదురపో వలసిందే! ఇవే ఆయన ఆరోగ్య నియమాలు!

అందరు మహనీయులు పుట్టిన తెనాలిలోనే ఆయన జన్మించారు. 1912 సం॥ము పుట్టిన రెండవ రోజున అనగా 1912 సం॥ము జనవరి 2న ఎల్లమరాజు గోపాలకృష్ణమూర్తి పుట్టారు. వారి తండ్రిగారు న్యాయవాదియని ముందే వ్రాసాను. ఆయన తెనాలి బజారులో నల్లకోటు వేసుకుని నడుస్తుంటే అంగళ్ళలోనివారు, ఇళ్ళమీద అరుగుల మీద కూర్చున్నవారు లేచి నుంచునేవారు. ఇప్పు డలాటి గౌరవమెక్కడ ఉన్నది? మంచి కొడిగట్టి పోయింది.

ఈ శతవత్సర న్యాయ సంపన్న కుటుంబీకుడు నిండు నూట ఇరవైయేండ్లు ఆరోగ్యంతో వర్ధిల్లాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నాను.

– గోటేటి

# సంస్కృతంలోని రూప్యా నుంచీ రుపాయి పేరొచ్చింది!

'రూపాయి' అనేది ఆంగ్ల పదం కానేకాదు. ఆంగ్ల భాష అనేక సంస్కృత పదాలను తనలో ఒదిగింపచేసుకుంది. 1542వ సంవత్సరంలో 'రూపియా' నాణెమును విడుదల చేయడం జరిగింది. మొదట విడుదలైన రూప్యా నాణెం ఒక తులం బరువు ఉండేది. అంటే 180 ధాన్యపు గింజల ఎత్తుకు సమానం. 175 గులువు గింజల బరువులో, స్వచ్ఛమైన వెండితో తయారు కాబడి ఉండేది. నా ఊహ తెలిసిన తరువాత కూడా ఒక పాత వెండి రూపాయి నాణెమునిస్తే– రెండు మూడింతలు డబ్బును యిచ్చేవారు.

మొదటి రూపాయి నాణెంపై బ్రిటిషువారి కాలంలో One Rupee అనే ఆంగ్ల అక్షరాలు, దాని క్రింద ఒక రూపాయి అనే తెలుగు అక్షరాలే ఉండేవి. స్వతంత్రం వచ్చిన తరువాత, మనదరిద్రానికి దాఖలాగా, సత్తురూపాయలూ, నాణెములు వచ్చాయి. గాలికెగిరిపోయే నాణెములూ పావలా, అర్ధరూపాయి, పరిమాణంలో రూపాయి బిళ్ళలు వస్తున్నాయి. నిరక్షరాస్యులకు ఏ నాణెం ఏ విలువగలదో తెలియకుండా పోయింది.

# తిరుమల - తిరుపతి దేవస్థానముల పాలకమండలి కార్యనిర్వహణా ప్రముఖుడు అన్నారావు మూడున్నర దశాబ్దములు పాలించాడు!!

తిరుమల శ్రీనివాసుని రాజ్యాంగపాలనలో కార్యనిర్వహణాధికారిగా, పాలకమండలి అధ్యక్షునిగా ఒకే వ్యక్తి 35 సంవత్సరాల పాలించిన అవకాశం, అదృష్టం ఒక్క సి. అన్నారావు తక్క వేరెవ్వరికీ లభించలేదు. అది అదృష్టం అనే దానికన్నా తగిన అర్హతలుగల శక్తిమంతుడైన వ్యక్తియనీ, ఏడుకొండల వేంకటేశుడే అట్టి అర్హతలను అన్నారావుకు కల్గించాడని చెప్పుకోవాలి.



అన్నారావు కమీషనరుగా, కార్యనిర్వాహణాధికారిగా 35 సంవత్సరాలు తిరుమల తిరుపతి దేవస్థానములకు సేవలందించారు. దేవస్థానం ఉద్యోగులకు ఆయనంటే భయమూ ఉండేది; భక్తీ ఉండేది. ఆయన తిరుపతి టోల్గేటులో బయల్దేరారంటే చాలు; తిరుమలలోని సిబ్బంది తమ తమ పనుల్లో నిమగ్నమై ఉండేవారు. ఎవరైనా విధుల్లో క్రమం తప్పి ఉన్నారని ఆయన అభిప్రాయపడ్డారా- వెంటనే ఆ ఉద్యోగిని సస్పెండు చేసేవారు. ఉద్యోగులెవరూ పై అధికారికి తెలుపకుండా కొండదిగేవారు కాదు. రాత్రి డ్యూటీలో ఉండవలసినవారు కొండమీద ఉండవలసిందే! మినహాయింపు ఉండేదికాదు.

తిరుమల తిరుపతి దేవస్థానంలో పరిపాలన సుగమం కావటానికి, అనేక పాలనా విభాగాలను యేర్పాటు చేసారు. ఉద్యోగవకాశాలు పెంపుచేసారు. 250 మంది ఉండేపాలనా సిబ్బంది 1600 మందికి పెరిగింది. దేవస్థానానికి ఆదాయం పెరిగింది. ఎంత ఆదాయం పెరిగినా 14 శాతం కన్నా జీతాలు పెరగకుండా చూసేవారు. అలాటి పరిస్థితి వచ్చినపుడు తన జీతాన్ని సహితమూ తగ్గించి తీసుకునేవారు.

డొనేషన్ కాటేజీల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది అన్నారావుగారే! అదేవిధానం యిప్పటికినీ అమలు జరుగుతూంది. చాలావరకూ భక్తులకు కేటాయింపబడే కాటేజీలు, గదులూ భక్తుల విరాళాలతోనే నిర్మించడం జరుగుతూంది. అయితే డోనర్స్‌కు యిబ్బందికర పరిస్థితులెపుడూ అన్నారావుగారి కాలంలో జరుగలేదు.

తిరుమలలో ఉద్యానవనాలను ఏర్పాటుకు ఆద్యుడు అన్నారావుగారనే చెప్పాలి. ఆయన తరచు బెంగుళూరు వెడుతూ, అక్కడి ఉద్యానవనాలను ముఖ్యంగా లాల్‌బాగ్‌ను చూసి వస్తూండేవారు. అక్కడ అప్పటి ఉద్యానవన సహాయమంత్రి ఎం.వి. కృష్ణప్పనూ, శాఖా డైరెక్టర్ డా॥ మర్రిగౌడనూ ఆహ్వానించి, తిరుమల ప్రాంతాలు చూపించి పూలవనాల కనువైన ప్రాంతాలను పరిశీలించి, వనాలను పెంపుచేసే ప్రక్రియ ప్రారంభించారు. కొంత మంది కర్ణాటక ఉద్యానవనంలో పనిచేసే వారిని డెప్యుటేషన్‌పై రప్పించేవారు.

ఆనందనిలయానికి బంగారు తాపడం చేయించింది కూడా అన్నారావుగారే! శ్రీవారికి 1953 సం॥ములో నవరత్న హస్తం, 1960లో నవరత్న కిరీటం చేయించినది కూడా అన్నారావుగారే. తిరుమలలోని మిరాశీ వ్యవస్థను రద్దుచేయించడంలో అవిరళ కృషిని చేసింది కూడా అన్నారావుగారనే చెబుతారు. ముందాయన ఈ విషయంలో సఫలీకృతుడుగాకపోయినా, తరువాత తరువాత తన ప్రయత్నాన్ని కొనసాగించి మిరాశీ వ్యవస్థను రద్దు చేయించారు.

తిరుపతిలో స్వామివారి ఆసుపత్రినీ కొన్ని కార్యాలయాల నిర్మాణం కోసం భూసేకరణ కూడా అన్నారావుగారి కాలంలోనే జరిగింది.

తిరుమల తిరుపతి దేవస్థానముల ఆదాయాభివృద్ధికీ, పాలనావిభాగంలో వివిధ శాఖలు యేర్పడదానికి అన్నారావుగారి కృషి అపారం. రాబడిలో ఆయన ఎంత శ్రద్ధను కనపరిచారో, ఖర్చుల పరిధిలో కూడా ఆయన అన్ని జాగ్రత్తలను తీసుకున్నారు. **భక్తుల సౌకర్యాల విషయంలో అన్నారావెంతో శ్రద్ధ చూపారు.** ఆ కారణంగానేమో తిరుమల శ్రీనివాసుడాయన్నుంత కాలం సేవలకు వినియోగించుకున్నాడు. రాజకీయ ప్రమేయం అంతగా చొరబడకపోవడం కూడా ఆయనన్ని అభివృద్ధి పనులను చేయకలిగారు. ●







# మానవునికి ప్రకృతే గురువు

కె. మల్లికార్జున, బళ్ళారి

జగత్ సర్వం ఈశ్వరుని నివాసం. ఈశ్వరుని మయం, జ్ఞానులు, ఏ ప్రాణినీ హీనంగా చూడరు. రమణ మహర్షి కాకిని కూడా ప్రేమతో చూసేవారు. బుద్ధి, భాష ఈ రెండు భగవంతుడు మానవుడికి ఇచ్చిన వరాలు, మనిషి తన చుట్టూ ఉన్న ప్రకృతి నుంచే ప్రతిదీ నేర్చుకుంటున్నాడు. జంతువులకున్న గొప్ప శక్తులను గమనిస్తే ఆశ్చర్యం కలుగుతుంది. ఏనుగు శరీరం, సింహం ధైర్యం, గ్రామ సింహం విశ్వాసం. గోమాత క్షీరం, కోకిల కంఠం, నెమలి చందం, హంస అందం, చిలుకల వాలకం ఇలా ప్రతిప్రాణికి ప్రత్యేకత ఉంది.

చిరుతలాగా మనిషి పరుగెత్తలేడు. కాకిలాగా ప్రకృతిని పరిశుభ్రం చేయలేడు. చేపలాగ నీటిలో ఈదలేడు. అలాంటివి సాధించడానికి శాస్త్రజ్ఞులు ఘోర తపస్సు చేశారు. ఆ ప్రాణుల తీరుతెన్నులను పరిశోధించారు. యంత్రాలు తయారుచేశారు. ఆకాశయానం సాధ్యమైంది. జలాంతర్గాములు వచ్చాయి. కాలుష్యం హెచ్చరిల్లకుండా సాధ్యమైనంత చేసే కాకిలాంటి సర్వభక్షక యంత్ర ఆవిష్కరణ కోసం అహర్నిశలు శ్రమిస్తున్నాడు. ప్రకృతిలోని ధ్వనులను అనుకరిస్తూ మాటలు నేర్చాడు. మాటలు మనోహరంగా కూరుస్తూ కవిత్వం చెప్పాడు. 'రి'షభాది జంతువుల గొంతులను అనుసరిస్తూ సప్తస్వరాలు పలికాడు. సుమధుర సంగీతాన్ని సాధన చేశాడు. జంతువుల సహజ ఆహార విహారాలు వాటికి ఆరోగ్యాన్ని ఎలా చేకూరుస్తు న్నాయో పరిశీలించాడు. ప్రకృతి వైద్యానికి ఆకృతి నిచ్చాడు. 'పనికిరాదు' అనుకునే గడ్డిపోచ గొప్పపాఠాన్ని నేర్పుతుంది. ఒ చెరువుగట్టుపై మహావృక్షం ఉంది. దాని పెద్ద పెద్ద కొమ్మలు దశదిశలా వ్యాపించాయి. సమీపంలోనే గడ్డి మొక్క ఉంది. "నీదీ ఒక బతుకేనా నేను ఎంత గొప్పదాన్నో! నా కొమ్మలు చూడు, ఎంత విస్తరించి ఉన్నాయో నువ్వో చిరుగాలికే పడిపోయేటట్లున్న రెండు సన్న ఆకులతో ఊరికే ఊగిపోతుంటావు అని మహావృక్షం గడ్డిపోచను ఎగతాళి చేస్తూ ఉండేది. ఒక రోజు పెద్ద తుపాను వచ్చింది. ఆ ఝంఝామారుతం దెబ్బకు మహా వృక్షం వేళ్ళతో సహా పెళ్ళగిలి పడిపోయింది. గడ్డిపోచ మాత్రం మళ్లీ నిటారుగా నిం చుని మునుపటి కంటే అధిక ఆశతో విలసిల్లింది. ఇది ప్రపంచ ప్రఖ్యాత ఈసఫ్ నీతికథ. "అల్పుడెపుడు పలుకు ఆడంబరముగాను" అనే నీతి పద్యం అర్థం ఇదే.

చీమల నుంచి క్రమశిక్షణ మానవుడు నేర్చుకోవాలి. చిన్న చిన్న తేనె చుక్కలను మిక్కిలి పరిశ్రమతో ఒక్క చోటికి చేర్చే తేనెటీగల కృషి అనుసరణీయం. ఇవన్నీ ఎప్పటికి మానవాళికి సజీవపాఠ్యాంశాలే! భగవంతుడు బుద్ధిజీవియై మనిషిని సృష్టించి అతడి చుట్టూ అడుగడుగునా వివిధ విషయాలను బోధించే గురువులను ఏర్పరచాడు.

నీతికథలు ఎక్కువగా ప్రకృతిలోనే ముడిపడి ఉంటాయి. పశుపక్ష్యాదులు, వృక్షాలు మనుషు ల్లాగే మాట్లాడతాయి. నీతికథలు వినీ, చదివీ మనుషులు తమ జీవితాలను సరిదిద్దు కోవాలని పెద్దల ఉద్దేశం. అందుకే హితోపదేశా లను, నీతి చంద్రికనూ మనకు ప్రసాదించారు. ఈ కథల వల్ల నీతితోపాటు ప్రకృతి ప్రయత్నమూ అలవడు తుంది. తాము ప్రకృతిలో ఒక భాగమే అనే సంగతిని బాల్యంలోనే గ్రహించ గలుగుతారు.



మానవుడు సింహంలాగా గొప్ప పనిని సాధిం చడానికి పూనుకోవాలి. కొంగలాగ దేశకాలాను అనుకూలంగా ప్రవర్తిస్తూ కార్యాన్ని సాధించాలి. పోరాటంలో వెనుదీయక పోవడం, స్వార్జితంతోనే బతకడం అనేవి కోడిని చూసి గ్రహించాలి. దాంపత్య సుఖాన్ని కాకిలాగా రహస్యంగా అనుభవించాలి అని ఆచార్య చాణుక్యుడు సెల విచ్చాడు. 'ప్రకృతే పరమ గురువు' అని ఆ మేధావి ఎప్పుడో గ్రహించాడు.

ఈ సమస్త చరాచర ప్రకృతి అంతటా మనకు దర్శనమిస్తున్న ఒక మహత్త్వపూర్ణ అంశం. 'ఇవ్వడం' అనే పరోపకార గుణం ప్రకృతికి ఉన్నది.

ఈ భూమి మనకు ఆశ్రయం ఇస్తున్నది. తనచుట్టూ తాను తిరగడం వల్ల మనకు రాత్రిని ఇస్తున్నది. ఈ భూమిమీద సమస్తమూ భూమినుంచే ఆవిర్భవించి, భూమిలోనికి అంతర్ధానమవుతుంది. భూమి మనకు ఆధారభూతమైతే, సూర్యుడు మనకు జీవప్రదాత. సూర్యునితో సమానమైన కాంతి, శక్తి లేదు. సూర్యుడంటే జీవనం, లేకుంటే మరణం. భూమ్మీద సంభవించే సమస్త జీవ క్రియలకు మూలం సూర్యకిరణాలే. తల్లిగర్భంలోని పిండాన్ని మాయ కాపాడినట్లుగా, ఆకాశం ఈ భూమండలాన్ని చుట్టూ ఆవరించి ఉంది. ప్రమాదకరమైన పర్యావరణ క్రాంతి కిరణాలను తనలో ఐక్యం చేసుకొని, భూ మండలం మీద జీవరాశిని విపత్తునుంచి రక్షిస్తోంది ఈ సూర్య భగవానుడే.

మేఘాలు మనకు వర్షానిస్తున్నాయి. నదులు సుదూర తీరాల కొండకోనల్లోని బండరాళ్ళ మీది నుంచి దుముకుతూ మన కోసం నీటిని మోసుకొస్తున్నాయి. మన దాహాన్ని తీరుస్తున్నాయి. చెట్లు చేమలు మనకు పరోపకారాన్ని చేస్తున్నాయి. కాయలు, మధుర ఫలాలు, కందమూలాలను మనకందిస్తున్నాయి. ప్రాణాంత కమైన విషపూరిత వాయువుల్ని పీల్చుకుని ప్రాణవాయువును ఇస్తున్నాయి. ప్రకృతిలోని దైవసమానులైన ఈ చెట్టు చేమలు మంచితనానికి, అమృతమయమైన నీడను ఇవ్వటం వలన శిరస్సువంచి నమస్కరించక తప్పదు. తమకోసం నిలువ చేసు కొన్న ఆహారాన్ని, కాయలు, గడ్డల రూపంలో ఉన్నవాటిని మనం స్వీకరిస్తున్నాము.

చెట్లు తమ పండ్లను తాము తినవు.

నదులు తాము తెచ్చిన నీటిని త్రాగవు. 'ఇతరులకు సాయపడ్డడం కోసమే సాధుపురుషులు పుడతారు" అంటోంది సంత్‌వాణి. ●


రుచికి, సువాసనకి, ఆరోగ్యానికి నాణ్యమైన

"అజంతా"

వక్కపొడి

రవికుమార్ అండ్ కంపెని - చెన్నై



Beautiful City - Beautiful Hotel




Foreverar your Serivice in the Heart of Visakhaparnam

HOTEL Daspalla

Suryabagh, Visakhapatna - 520 020, A.P., India.

Ph : 2564825 (6 Lines), 2563141 (4 Lines), Fax : 91-0891-2562043

E-mail : dspvizag1@rediffmail.com, Visit us at : www.daspallahotels.com

Call National Toll Free No. : 1800-425-4225

# తలకోన జలపాతాల, అందాలూ తనివితీరా చూడండి!





వేంకటేశ్వరుడూ, కాళహస్తీశ్వరుడూ, కాణిపాకం వినాయకుడూ, పద్మావతమ్మ స్వయంభువ క్షేత్రాల క్షేత్రం చిత్తూరు జిల్లా క్షేత్రం. శేషాచలం కొండల్లో ఎందరో మునులు యిప్పటికీ తపస్సు చేస్తున్నారు. గంధర్వాది దేవతలు వస్తున్నారు. అంతకన్నా గొప్పవి ఏఁవంటే అందమైన ప్రకృతి, కొండలు, కోనలు, జలపాతాలు కోకొల్లలు. అందులో చెప్పుకోదగ్గ అందాల కాశ్మీరమును తలపించేదే తలకోన. తూర్పు కనుమల్లో తీర్చిదిద్దినట్లుగా ఉన్న శేషాచల కొండలమీద కొలువుదీరిన తిరుమలేశుణ్ణి ఆ కొండలకు తలభాగంగా చెప్పే తలకోన అందాల్ని తనివితీరా సందర్శించండి.

ఇంటర్నెట్‌లో యాధృచ్ఛికంగా చూస్తుంటే తలకోన కనిపించింది. అదీ తిరుపతి దగ్గర్లోనే ఉందని తెలిసింది. మనదేశంలోని జలపాతాలన్నింటికన్నా ఎత్తయినది కర్ణాటకలో వుంటే, ఆంధ్రప్రదేశ్‌లో కెల్లా ఎత్తయినది చిత్తూరుజిల్లాలోని తలకోనలోనే ఉందని తెలుసుకోవాలి. తిరుపతి నుంచి 58 కిలోమీటర్ల దూరంలో తలకోన ఉంది. తలకోన చూడ్డానికి తిరుపతి నుంచి మదనపల్లి వెళ్లే రోడ్డులో భాకరాపేట దగ్గర మలుపు తిరిగితే తలకోనకు వెళ్లు దారి వస్తుంది. కానీ తలకోన దగ్గర తినడానికి ఏమీ దొరకవు కాబట్టి భాకరాపేటలోనే ఏమైనా తినేయడం మంచిది. కానీ అంత చిన్నఊళ్ళోని హోటల్లో తినడానికి ఇష్టం లేక బిస్కెట్లు, అరటిపండ్లు కొనుక్కున్నాం.

గంటన్నరలోనే తలకోన చేరుకున్నాం. తిరుపతిలో కన్నా అక్కడ చలి ఎక్కువగా ఉంది. ఎత్తయిన కొండలూ వాటినిండా దట్టంగా అల్లుకున్న పచ్చని మొక్కలతో తలకోన ఎంతో ఆహ్లాదకరంగా ఉంది.

తలకోన పేరు ఎలా వచ్చిందన్నదాని మీద ఆసక్తికరమైన కథనాలు ఉన్నాయి. శేషాచల కొండలలో శ్రేష్ఠమైనది కాబట్టి తలకోన అని పిలుస్తారన్నది ఒక కథనం. కుబేరుడి అప్పు తీర్చడానికి ధనాన్ని కొలిచీ కొలిచీ అలసిపోయిన వెంకటేశ్వరస్వామి ఇక్కడకు వచ్చి తలవాల్చాడు కాబట్టి తలకోన పేరొచ్చిందని మరో కథనం.

తలకోనలో ముందుగా సిద్దేశ్వరస్వామి ఆలయానికి వెళ్ళాలి. ఈ ఆలయాన్ని 1811 ప్రాంతంలో అప్పాస్వామి అనే భక్తుడు నిర్మించాడని అక్కడివారు చెప్పారు. శివరాత్రినాడు ఎంతోమంది భక్తులు తలకోనకు వస్తారట. సమీపంలోనే ఉన్న నెలకోనలో స్నానం చేసి సంతానం కోసం ప్రార్థిస్తే ఆ కోరిక తీరుతుందని భక్తుల విశ్వాసం. ఆలయంలోని నెమలి వాహనం చూపరుల దృష్టిని ఆకర్షిస్తుంది. మన ఆంధ్రప్రదేశ్‌లోని సుందర కాశ్మీరం తలకోన! ●

---

**మృదుల సుమవల్లి - దొగరు**
**చిగురాకు - దొడగు నునుమొగ్గ**
**సురచిర సుమంబు- అహ**
**నహో! ఏఁవిరుచ్యంబగు**
**తెలుగుపద పారిజతములు**
(తెలుగు మాధుర్యంబును తెలుసుకోలేకుండా పోతున్నామే ఆత్మ ఆవేదన చెందుతుంది.)

**ఎవరి ఆనందముకూ అడ్డురాను!**
**నా ఆనందమును అడ్డుకున్నా-**
**అభ్యంతరమూ చెప్పబోను!**
**ప్రతీ ఒక్కరికీ చేరువకావాలన్నది నా ఆశ!**
**అందరివాడను కావాలన్నది ఆకాంక్ష!**
**అందని ఫలాలకు వెతలాడను**
**గోటేటి గుణపేటిగానే ఉండాలి!**




**- గోటేటి శ్రీరామారావు**

---

# తెలంగాణా కవియే గాని తెలుగుల కవి!

ప్రజలభాషలో కవితలు వ్రాసి ప్రజలకోసమే జీవించిన కవి కాళోజీ నారాయణ రావు.

**అతిథివోలె వుండి వుండి**
**అవని విడిచి వెళ్ళుతాను!**
**గుట్టలపై ఎక్కివెక్కి గట్టులు దిగజారినాను**
**లోయలలో దూకి దూకి లోతులెన్నో చూచినాను!**
**నే ప్రాకని యెత్తు లేదు**
**నే జారని లోతు లేదు!**
**మూలజేరి మునులవోలె**
**మూగనోము పట్టినాను!**
**ఈగవోలె దోమవోలె**
**వాగుచు తిరుగాడినాను!**



**- కాళోజీ**

అతులిత పుష్ప పల్లవ ఫలాన్విత
భూరుహ భూరివల్లరీ
- మన మాతృభాష ఔన్నత్యం అభివ్యక్తీకరించడం,
ప్రతి ఉషస్సున లేవగానే
పాఠకులపై భారం వేయరాదని,
ఆరాధించడమనే తపనం, తపస్సు!
అర్థ, వృద్ధ భారాన్ని మోస్తూనే

అఆ

338 నెలలుగా
338 సంచికలను

శ్రీ వేంకటేశ చరణౌ శరణం ప్రపద్యే।

# ప్రముఖాంధ్ర

- వెలువరించ కలిగిదందంటే ఏడుకొండల టేడు కృప! వాగ్దేవి యిచ్చిన శక్తి!

'ప్రముఖాంధ్ర' వెబ్ ఎడిషన్ చూచినవారు
పాత పత్రికలను చూచినవారూ 'ప్రముఖాంధ్ర' కోరుతున్నారు.
కోరినవారందరికీ పంపాలనే ఉన్నది.
ధనసంపత్తి కలవారూ, మన సంపత్తి కలవారూ
ప్రముఖాంధ్ర నిధికి యధోచితంగా సహకరించండి.
రు.25000లు మించి పంపించిన ప్రదాతల పేర్లను
వారి ఫోటోలతో ప్రచురిస్తాం.
(ఉడతా భక్తిగా చిన్న విరాళములనూ పంపవచ్చు)



గోటేటి శ్రీరామారావు
స్థాపక సంపాదకుడు

చిరునామా:
16 (64), Thambiah Reddy Road, West Mambalam, Chennai - 600 033.
Phone : 91-44-24742091, 91-44-23716322, 91-44-24894145 - Tele Fax : 91-44-23716322
www.pramukhandhra.org/E.mail : pramukhandhra95@gmail.com









**The One Stop solution for all your Printing Needs**

**GOTETI GRAPHICS**

64 (16), Thambiah Road, West Mambalam, Chennai - 600 033. INDIA

✆ : **098400 48941** E-mail : **gotetigraphics@gmail.com**

***Our print support creates a remarkable value in your business***